ANN తెలుగు

Follow: @ANNTELUGU

21-07-2026

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్  సంపుటి- 23  సంచిక- 198  పేజీలు-08  వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI  REGISTERED NUMBER: APTEL/2003/09316  WWW.EPAPER.MAHAADAILY.COM



## సభ్యులంతా సానుకూల దృక్పథంతో వ్యవహరించాలి

- పార్లమెంట్ వర్షా కాల సమావేశాలకు శ్రీకారం.
- నిర్మాణాత్మక చర్చలకు ప్రధాని మోదీ పిలుపు..

**ఢిల్లీ, మహా :** పార్లమెంట్ వర్షా కాల సమావేశాలు సోమవారం ప్రారంభమైన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రయోజనాల దృష్ట్యా ఉభయ సభల్లో నిర్మాణాత్మక చర్చలు జరగాలని ఆకాంక్షించారు. ప్రజా సంక్షేమానికి సంబంధించిన కీలక అంశాలపై సభ్యులంతా సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు. సమావేశాల ప్రారంభానికి ముందు పార్లమెంట్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడిన ప్రధాని, ఇటీవలి అంతరిక్ష విజయాలను ప్రస్తావిస్తూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై పరోక్ష వ్యాఖ్యలు చేశారు.

భారత్ అంతరిక్ష రంగంలో కొత్త చరిత్ర సృష్టిస్తోందని, ఇటీవల భారత యువత స్థాపించిన ప్రైవేట్ స్టార్టప్ స్కైరూట్ విజయవంతంగా రాకెట్ ప్రయోగించడం దేశానికి

మిగతా 7వ పేజీలో

టాప్ న్యూస్



### ఈనెల 26న తెలంగాణకు అమిత్ షా

- కరీంనగర్‌లో పర్యటన, రాష్ట్ర నేతలతో కీలక భేటీ

02



### బీఆర్ఎస్‌లోనే కొనసాగుతా

- మల్లారెడ్డి క్లారిటీ
- కేసీఆర్ నాయకత్వంపై పూర్తి విశ్వాసం
- తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని విజ్ఞప్తి

02

### తెలంగాణ మెట్రో కు కేంద్రం షాక్




- తెలంగాణలో కొత్త మెట్రో రైలు ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వలేదని కేంద్రం స్పష్టం
- రాజ్యసభలో ఎంపీ ప్రశ్నకు కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ రాతపూర్వక సమాధానం

03



### నీటిలోనే అపార శక్తి

- 100 ఏళ్ల మిస్టరీని ఛేదించానన్న భారత సంతతి శాస్త్రవేత్త.
- ప్రపంచ శాస్త్రవేత్తల్లో ఆసక్తి రేకెత్తించిన యోగేంద్ర నారాయణ్ శ్రీవాత్సవ ప్రకటన.

04



# రేవంత్ దార్శనికతకు కేంద్రం దన్ను

- తెలంగాణ లో ఎయిర్ పోర్ట్ లు రైరై
- సమన్వయనికి నిలువెత్తు నిదర్శనం నూతన విమానాశ్రయాల ఏర్పాటు.
- రాజ్యసభ సాక్షిగా రాష్ట్ర ద్వితీయ శ్రేణి నగరాల విమానయాన ముఖచిత్రంపై స్పష్టత.



**హైదరాబాద్, మహా :** అభివృద్ధి అనేది ఏ ఒక్కరితోనో సాధ్యమయ్యే ప్రస్థానం కాదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ కుమ్ములాటలను పక్కనపెట్టి, ప్రజా సంక్షేమమే పరమావధిగా అడుగులు కలిపినప్పుడు ప్రగతి రథచక్రాలు శరవేగంగా కదులుతాయి. సరిగ్గా ఇప్పుడు తెలంగాణ పౌర విమానయాన రంగంలో ఆవిష్కృతమవుతున్న దృశ్యం ఇదే. దశాబ్దాలుగా కేవలం హైదరాబాద్‌కే పరిమితమైన విమానయాన సేవలను రాష్ట్రంలోని ద్వితీయ శ్రేణి నగరాలకు విస్తరించాలన్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సుదీర్ఘ దార్శనికతకు.. కేంద్ర ప్రభుత్వం సానుకూల దృక్పథం, వేగవంతమైన సాంకేతిక సహకారం తోడయ్యాయి. రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ వేం నరేందర్ రెడ్డి అడిగిన ఓ కీలక ప్రశ్నకు, పౌర విమానయాన

మిగతా 3వ పేజీలో



# యుద్ధ భయం

- నిప్పలు చెరుగుతున్న అమెరికా, నిలువరిస్తున్న మధ్యవర్తులు.
- బహ్రెయిన్, కువైట్‌లపై ఇరాన్ ప్రతీకారం.. బుషెహర్ పోర్టుపై అమెరికా గురి.
- 10 రోజుల పాటు దాడుల విరామానికి మధ్యవర్తుల ప్రతిపాదన.

**హైదరాబాద్, మహా:** అమెరికా, ఇరాన్ దేశాల మధ్య రగులుతున్న యుద్ధం గల్ఫ్ ప్రాంతాన్ని అగ్నిగుండంగా మారుస్తోంది. నిమిష నిమిషానికి ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరుకుంటున్న వేళ, అంతర్జాతీయ సమాజం ఊపిరి బిగబట్టి చూస్తోంది. ఒకవైపు అమెరికా యుద్ధ విమానాలు ఇరాన్ గడ్డపై నిప్పుల వాన కురిపిస్తుంటే, మరోవైపు ఇరాన్ కూడా ఏమాత్రం తగ్గకుండా అమెరికా మిత్రదేశాలపై ప్రతీకార దాడులకు తెగబడుతోంది. ఈ విధ్వంసకర వాతావరణంలో మూడో ప్రపంచ యుద్ధం ముంచుకొస్తుందా అన్న భయాల నడుమ దౌత్య మార్గాలు తెరుచుకోవడం ఒక అనూహ్య పరిణామం. అగ్రరాజ్యాల మధ్య శాంతిని నెలకొల్పేందుకు అదృశ్య శక్తులుగా మధ్యవర్తులు రంగంలోకి దిగారు. పది రోజుల పాటు దాడులకు విరామం పలకాలని, పాత శాంతి ఒప్పందాలను పునరుద్ధరించాలని వారు ఇరు దేశాల ముందు ఒక బలమైన ప్రతిపాదనను ఉంచారు. ఒక చేత్తో ఆయుధాలు పట్టుకుని, మరో చేత్తో శాంతి చర్చలకు

మిగతా 3వ పేజీలో



### ప్రభుత్వ విద్యను ప్రైవేటీకరించే కుట్ర జరుగుతోంది

03


- 27 వేల పాఠశాలలను 4 వేలకు కుదించే ప్రయత్నం.
- యంగ్ ఇండియా స్కూళ్ల టెండర్లపై సీఎం రేవంత్‌రెడ్డి వివరణ ఇవ్వాలి.
- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

### లైంగిక వేధింపుల ఆరోపణలు

- ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నం
- ఆస్పత్రిలో చేర్చిన బంధువులు

07





### క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లకు నేటి నుంచి దరఖాస్తులు

03

- రూ.10 వేల టోకెన్‌తో నమోదు.. ఆగస్టు 10 వరకు అవకాశం.

## నేడు వికారాబాద్ జిల్లాకు సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మహా :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేటి నుంచి రెండు రోజుల పాటు వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో ప్రధానంగా దుద్యాల్ మండలం హకీంపేటలో ఎడ్యుకేషన్ హబ్ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. అనంతరం ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షిస్తారు. రాత్రి కొడంగల్‌లో బసచేసి 22వ తేదీన నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను సమీక్షిస్తారు. ఎస్ ఐ ఆర్ కొనసాగుతున్న తీరును ముఖ్యమంత్రి పరిశీలిస్తారు. మధ్యాహ్నం తర్వాత తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరుతారు.




### దాశరథి పురస్కారానికి ప్రముఖ సాహితీవేత్త గుడిపాటి ఎంపిక

అక్షరమే శ్వాసగా సాగిన ఆయన ప్రస్థానం.

02


## 6 నెలల్లో 554 మంది భర్తల మృతి

- 322 హత్యలు, 232 ఆత్మహత్యలు
- వెలుగులోకి సంచలన రిపోర్ట్



**హైదరాబాద్, మహా :** ఈ ఏడాది మొదటి 6 నెలల్లో దేశవ్యాప్తంగా 554 మంది భర్తలు హత్యకు గురికావడం లేదా ఆత్మహత్య చేసుకున్నట్లు ఒక రిపోర్టు బయటికి రావడం పెను సంచలనం సృష్టిస్తోంది. ఇందులో 322 హత్యలు కాగా.. మిగిలిన 232 మంది ఆత్మహత్యలు చేసుకున్నారని ఆ నివేదిక తెలిపింది. 322 హత్యల్లో 60 శాతం వివాహేతర సంబంధాల కారణంగా.. 232 ఆత్మహత్యలు కుటుంబ కలహాలు, గృహహింస, వేధింపుల కారణంగా జరిగాయని తెలుస్తోంది. ఇవి అధికారిక గణాంకాలు కాకుండా

మిగతా 2వ పేజీలో




# దాశరథి పురస్కారానికి ప్రముఖ సాహితీవేత్త గుడిపాటి ఎంపిక

**అక్షరమే శ్వాసగా సాగిన ఆయన ప్రస్థానం.**

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందించే 'దాశరథి కృష్ణమాచార్య అవార్డు2026'కు ప్రముఖ కవి, విమర్శకులు, 'పాలపిట్ట' మాసపత్రిక సంపాదకులు గుడిపాటి ఎంపికయ్యారు. దశాబ్దాలుగా తెలుగు సాహిత్యానికి, ముఖ్యంగా పత్రికా రంగానికి ఆయన చేసిన నిస్వార్థ సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం ఈ అవార్డును ప్రకటించింది. సామాన్య మధ్యతరగతి కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన గుడిపాటి, బాల్యం నుంచే తెలుగు భాష, సాహిత్యం పట్ల అపారమైన మక్కువ పెంచుకున్నారు. ఆయన కుటుంబ నేపథ్యం నిరాడంబరమైనది కావడంతో, అదే లక్షణం ఆయన వ్యక్తిత్వంలోనూ, జీవనశైలిలోనూ అడుగడుగునా కనిపిస్తుంది. ఆస్తిపాస్తుల కన్నా అక్షర సంపదనే గొప్పగా భావించిన ఆయన, తన జీవితాన్ని పూర్తిగా సాహిత్యానికే అంకితం చేశారు. తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును ఏర్పరచుకున్న ఆయన, తోటి సాహితీవేత్తలనే తన కుటుంబంగా, సాహిత్యమే తన ప్రపంచంగా భావిస్తూ నిరంతరం ముందుకు సాగుతున్నారు.


**సాహిత్య సేవలు, విశేష రచనలు**

గుడిపాటి అనగానే ముందుగా గుర్తుకొచ్చేది 'పాలపిట్ట' మాసపత్రిక. ఆర్థికంగా, ఇతరత్రా ఎన్నో ఇబ్బందులు ఎదురైనప్పటికీ అత్యున్నత సాహిత్య ప్రమాణాలతో ఈ పత్రికను నిరంతరాయంగా నిర్వహించడంలో ఆయన అంకితభావం అనన్య సామాన్యం. ఎందరో యువ కవులను, కొత్త రచయితలను ప్రోత్సహించి వారి మొదటి రచనలను అచ్చువేసి సాహిత్య లోకానికి పరిచయం చేసిన ఘనత ఆయనది.కేవలం సంపాదకుడిగానే కాకుండా, కవిగా, విమర్శకుడిగా ఆయన ఎన్నో విశేషమైన రచనలు చేశారు. సమకాలీన కవిత్వంపై ఆయన రాసిన విమర్శనాత్మక వ్యాసాలు, వివిధ పుస్తకాలకు రాసిన ముందుమాటలు, సంపాదకీయాలు ఆయన లోతైన అధ్యయనానికి నిదర్శనం. సామాజిక రుగ్మతలను ప్రశ్నిస్తూ, మట్టి మనుషుల జీవన చిత్రాలను, అట్టడుగు వర్గాల వ్యథలను తన రచనల ద్వారా ఆవిష్కరించారు. అనేక కవితా సంకలనాలను, కథా సంపుటాలను వెలుగులోకి తేవడంలో, మరుగున పడిన ఎందరో ప్రాచీన, ఆధునిక కవుల సాహిత్యాన్ని పాఠకులకు చేరువ చేయడంలో గుడిపాటి కీలక పాత్ర పోషించారు.

# కొత్త విమానాశ్రయాలపై కేంద్రం కీలక ప్రకటన

**మామునూరు ఎయిర్‌పోర్టు పనులకు టెండర్లు.**

ఆదిలాబాద్, పెద్దపల్లి, కొత్తగూడెం ప్రాజెక్టులపై తాజా వివరాలు వెల్లడి ఢిల్లీ, మహా: తెలంగాణలో కొత్త విమానాశ్రయాల అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం కీలక వివరాలు వెల్లడించింది. వరంగల్ జిల్లా మామునూరు విమానాశ్రయం అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయని, ఇప్పటికే టెండర్ల ప్రక్రియ ప్రారంభించినట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ వెల్లడించింది. అదే సమయంలో ఆదిలాబాద్, పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ప్రతిపాదిత విమానాశ్రయాల పురోగతిపై కూడా తాజా సమాచారం ఇచ్చింది. రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ వేం నరేందర్ రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. తెలంగాణలో ప్రాంతీయ అనుసంధానానికి ప్రాధాన్యమిస్తూ ఉడాన్ పథకం కింద ఇప్పటివరకు 58 విమాన మార్గాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. వరంగల్ జిల్లా మామునూరు విమానాశ్రయాన్ని రూ.496.86 కోట్ల అంచనా వ్యయంతో (జీఎస్టీతో కలిపి) అభివృద్ధి చేయడానికి భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ సూత్రప్రాయ ఆమోదం తెలిపిందని కేంద్రం వెల్లడించింది. ఈ ప్రాజెక్టులో రన్‌వే, అప్రాన్, టాక్సీవే నిర్మాణ పనులతో పాటు కాంపౌండ్ వాల్ నిర్మాణానికి సంబంధించిన టెండర్లను ఇప్పటికే ఏఏఐ ఆహ్వానించినట్లు పేర్కొంది. అయితే మామునూరు విమానాశ్రయం నుంచి విమాన సర్వీసులు ఎప్పుడు ప్రారంభమవుతాయన్నది భూసేకరణ పూర్తి కావడం, అవసరమైన కేంద్ర అనుమతులు లభించడం వంటి అంశాలపై ఆధారపడి ఉంటుందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాతే తదుపరి నిర్మాణ పనులు, విమానాల రాకపోకల షెడ్యూల్ ఖరారవుతుందని పేర్కొంది. ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్‌గా అభివృద్ధి చేసే ప్రతిపాదనపై కూడా పురోగతి సాధించినట్లు కేంద్రం



వెల్లడించింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ టెక్నో-ఎకనామిక్ ఫీజిబిలిటీ అధ్యయనాన్ని పూర్తి చేసి, విమానాశ్రయ అభివృద్ధికి అవసరమైన భూవిస్తీర్ణ వివరాలను ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వానికి అందజేసినట్లు తెలిపింది. పెద్దపల్లి జిల్లాలో ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి సంబంధించిన ప్రీ-ఫీజిబిలిటీ అధ్యయన నివేదికను 2026 ఫిబ్రవరిలోనే రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించినట్లు కేంద్రం పేర్కొంది. ఆ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాల్సి ఉంటుందని వివరించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయ ఏర్పాటుపై నిర్వహించిన సర్వేలో ప్రతిపాదిత స్థలం అనుకూలంగా లేదని కేంద్రం వెల్లడించింది. 2025 జనవరిలో రామవరం, చుంచుపల్లి, సుజాతనగర్ గ్రామాల్లో నిర్వహించిన సర్వేలో కొండలు, రైల్వే మార్గం ప్రధాన అడ్డంకులుగా ఉన్నట్లు గుర్తించారని, అందువల్ల ఆ ప్రాంతం విమానాశ్రయ నిర్మాణానికి అనువుగా లేదని తేలినట్లు పేర్కొంది. దీంతో ప్రత్యామ్నాయ స్థలాల పరిశీలన అవసరమవుతుందని కేంద్రం సూచించింది. మొత్తంగా తెలంగాణలో ప్రాంతీయ విమానయాన సేవల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తోందని, మామునూరు విమానాశ్రయం అభివృద్ధి పనులు ప్రస్తుతం అత్యంత వేగంగా ముందుకు సాగుతున్న ప్రాజెక్టుగా నిలిచిందని కేంద్ర ప్రభుత్వం రాజ్యసభలో వెల్లడించింది.



# బీఆర్ఎస్‌లోనే కొనసాగుతా మల్లారెడ్డి క్లారిటీ

**హైదరాబాద్, మహా :** పార్టీ మారుతున్నారంటూ సోషల్ మీడియా, రాజకీయ వర్గాల్లో జరుగుతున్న ప్రచారానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి తెరదించారు. తాను ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీ మారబోనని, బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని స్పష్టంగా ప్రకటించారు. తన రాజకీయ భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ పార్టీ మారే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.సోమవారం మీడియాతో మాట్లాడిన మల్లారెడ్డి, తనపై జరుగుతున్న ప్రచారాన్ని నమ్మవద్దని ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. కొందరు ఉద్దేశపూర్వకంగానే తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అందులో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేశారు.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంపై తనకు పూర్తి విశ్వాసం ఉందని మల్లారెడ్డి తెలిపారు. పార్టీ తనకు రాజకీయ గుర్తింపును ఇచ్చిందని, ఆ పార్టీని వీడే ఆలోచనే లేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ బలోపేతమే తన లక్ష్యమని, గతంలో పార్టీ అభివృద్ధి కోసం ఎలా కృషి చేశానో, భవిష్యత్తులో కూడా అదే నిబద్ధతతో పనిచేస్తానని అన్నారు.రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేసే కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటానని, పార్టీ శ్రేణులతో కలిసి ప్రజల్లోకి వెళ్లి బీఆర్ఎస్ విధానాలను తీసుకెళ్తానని వెల్లడించారు. తన పార్టీ మార్పుపై జరుగుతున్న ప్రచారంతో కార్యకర్తలు గానీ, నాయకులు గానీ ఎలాంటి అయోమయానికి గురికావద్దని, బీఆర్ఎస్‌లోనే తన రాజకీయ ప్రయాణం కొనసాగుతుందని మరోసారి స్పష్టం చేశారు.

# తెలంగాణ హక్కుల కోసం కేంద్రంపై పోరాటం కొనసాగిస్తాం

**ఎంపీ వద్దిరాజు రవిచంద్ర.**



**హైదరాబాద్, మహా :** తెలంగాణ సమస్యల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తీసుకొస్తూనే, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజాపోరాటాలను మరింత ఉధృతం చేస్తామని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు అందించిన తరహాలోనే తెలంగాణకు కూడా కేంద్రం న్యాయం చేయాలని డిమాండ్ చేసిన ఆయన, రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా, కేంద్రం నుంచి రావాల్సిన అన్ని బకాయిల సాధన వరకు తమ పోరాటం ఆగదని ప్రకటించారు.సోమవారం మీడియాతో మాట్లాడిన వద్దిరాజు రవిచంద్ర, తెలంగాణకు రావాల్సిన కేంద్ర నిధులు, పెండింగ్ బకాయిలన్నింటినీ సాధించేందుకు పార్లమెంట్‌లోనూ, ప్రజా వేదికలపైనా నిరంతరం పోరాడతామని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, కేంద్రం తెలంగాణకు న్యాయం చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.రాష్ట్రంలో రిజర్వాయర్లలో కనీస నీటి నిల్వలు కూడా ప్రభుత్వం నిర్వహించలేకపోయిందని ఆయన ఆరోపించారు. రిజర్వాయర్లలో కనీసం 25 నుంచి 30 శాతం వరకు నీటి నిల్వలు ఉండేలా చర్యలు తీసుకోవాల్సి ఉండగా ప్రభుత్వం విఫలమైందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని వినియోగించకుండా సముద్రంలోకి వదిలేయడం వల్ల హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా తాగునీటి సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాళేశ్వరం పంపులను వెంటనే ప్రారంభించి నీటిని నిల్వ చేయాలని రైతులు, పదవీ విరమణ పొందిన ఇంజినీర్లు కూడా కోరుతున్నారని గుర్తు చేశారు.

ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఫ్యాక్టరీ పునరుద్ధరణ అంశాన్ని ప్రస్తావిస్తూ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇటీవల కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి హెచ్.డి. కుమారస్వామిని కలిసి ఈ అంశంపై వినతి పత్రం అందజేశారని తెలిపారు. సీసీఐ ఫ్యాక్టరీ పునరుద్ధరణ జరిగితే ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు ఆరు వేల మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. సున్నపురాయి గనుల లీజుల క్రమబద్ధీకరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి అవసరమైన లేఖ పంపితే ఈ ప్రక్రియ మరింత వేగవంతం అవుతుందని అన్నారు.కల్వకుంట్ల చంద్రశేఖరరావు నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించిందని వద్దిరాజు పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి, ఒకప్పుడు 35 లక్షల టన్నులుగా ఉన్న ధాన్య ఉత్పత్తిని మూడు కోట్ల టన్నులకు పెంచిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని అన్నారు.

ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన విమర్శించారు. మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలమవడంతో రైతులు దళారులను ఆశ్రయించి కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరలకు పంటను విక్రయించాల్సి వస్తోందని ఆరోపించారు. రైతులతో పాటు రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దీనికి ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళికలు లేకపోవడమే కారణమని అన్నారు.

సింగరేణి సమస్యల పరిష్కారం, థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుల పునరుద్ధరణ, బొగ్గు ఉత్పత్తి పెంపు, తాడిచర్ల2 గని పనులను వెంటనే ప్రారంభించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. అలాగే సీసీఐ ఫ్యాక్టరీ తిరిగి ప్రారంభమయ్యే వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.ప్రజా సమస్యలను గాలికి వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పాలనపై దృష్టి సారించాలని వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు. తెలంగాణ అభివృద్ధి, భవిష్యత్తు, రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణ బీఆర్ఎస్‌తోనే సాధ్యమవుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

# భోగాపురం విమానాశ్రయానికి ప్రత్యేక ఏసీ ఎలక్ట్రిక్ బస్సులు.

**100 ఆధునిక బస్సులతో విమాన ప్రయాణికులకు మెరుగైన అనుసంధానం**

**విశాఖపట్నం, మహా.** ఉత్తరాంధ్ర ప్రజలకు త్వరలో అందుబాటులోకి రానున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుసంధానంగా ఏపీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక రవాణా ఏర్పాట్లు చేపట్టింది. విశాఖపట్నం నగరం నుంచి సుమారు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న భోగాపురం విమానాశ్రయానికి ప్రయాణికులు సౌకర్యవంతంగా చేరుకునేందుకు అత్యాధునిక ఎలక్ట్రిక్ ఏసీ బస్సులను అందుబాటులోకి తీసుకురానుంది. పర్యావరణహిత రవాణాకు ప్రాధాన్యం ఇస్తూ మొత్తం 100 ఎలక్ట్రిక్ బస్సులను దశలవారీగా ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. భోగాపురం విమానాశ్రయం పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత విశాఖలోని ప్రస్తుత విమానాశ్రయం నౌకాదళం (నేవీ) ఆధీనంలోకి వెళ్లనున్న నేపథ్యంలో విమాన ప్రయాణికుల రాకపోకలను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. విశాఖ నగర ప్రజలతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల ప్రయాణికులకు ఈ సేవలు ఎంతో ఉపయోగకరంగా మారనున్నాయి. ఈ క్రమంలో కూర్మన్నపాలెం ఆర్టీసీ డిపోకు తొలి విడతగా నాలుగు అత్యాధునిక ఎలక్ట్రిక్ ఏసీ బస్సులు చేరుకున్నాయి. ఇవి త్వరలో భోగాపురం విమానాశ్రయానికి రెండు వేర్వేరు మార్గాల్లో సర్వీసులు ప్రారంభించనున్నాయి. ఒకసారి పూర్తిగా చార్జింగ్ చేస్తే సుమారు 200 కిలోమీటర్ల వరకు ప్రయాణించే సామర్థ్యం ఈ బస్సులకు ఉంది. ఒక్కో బస్సులో 40 మంది ప్రయాణికులు కూర్చునే సౌకర్యం కల్పించారు. ప్రయాణికుల భద్రత, సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఆటోమేటిక్ డోర్లు, పబ్లిక్ అడ్రస్ (మైక్) వ్యవస్థ, సీసీ కెమెరాలు, ఆధునిక భద్రతా పరికరాలతో బస్సులను రూపొందించారు. పూర్తిగా ఎలక్ట్రిక్ వాహనాలు కావడంతో కాలుష్యం లేకుండా, తక్కువ శబ్దంతో ప్రయాణ సౌకర్యాన్ని అందించనున్నాయి. ఏసీ సౌకర్యం కారణంగా దీర్ఘదూర ప్రయాణం కూడా మరింత సౌకర్యవంతంగా ఉండనుంది. గాజువాక వైపు నుంచి బయలుదేరే సర్వీసులు ఎన్ఏడీ కూడలి, గురుద్వారా, మద్దిలపాలెం, హనుమంతవాక, మధురవాడ, ఆనందపురం, తగరపువలస మీదుగా భోగాపురం విమానాశ్రయానికి చేరుకుంటాయి. మరో మార్గంలో సింధియా, రైల్వే స్టేషన్, ద్వారక బస్ స్టేషన్, వుడా పార్క్, ఋషికొండ, ఐటీ హిల్స్, మారికవలస మీదుగా సర్వీసులు నడపనున్నారు. మొదటి దశలో 20 ఎలక్ట్రిక్ ఏసీ బస్సులను అందుబాటులోకి తీసుకురానుండగా, అనంతరం మొత్తం 100 బస్సులతో సేవలను విస్తరించాలని ఏపీఎస్‌ఆర్టీసీ ప్రణాళిక రూపొందించింది. విశాఖపట్నంతో పాటు అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి కూడా భోగాపురం విమానాశ్రయానికి ప్రత్యేక ఏసీ బస్సు సర్వీసులు నడపాలని అధికారులు భావిస్తున్నారు. ఇదే సమయంలో విమాన ప్రయాణికుల కోసం విశాఖ నగరంలో ప్రత్యేక వెయిటింగ్ లాంజ్‌లను ఏర్పాటు చేసేందుకు జీఎంఆర్ సంస్థ చర్యలు చేపడుతోంది. విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులు సౌకర్యవంతంగా వేచి ఉండేందుకు అవసరమైన అన్ని వసతులు కల్పించనున్నారు. ఈ ప్రత్యేక బస్సుల చార్జీలను త్వరలో అధికారికంగా ప్రకటించనున్నట్లు ఆర్టీసీ వర్గాలు తెలిపాయి. బస్సులను ప్రైవేటు డ్రైవర్లు నడిపినప్పటికీ, టికెట్ల జారీ బాధ్యతలను ఏపీఎస్‌ఆర్టీసీ కండక్టర్లే నిర్వహించనున్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభంతో ఉత్తరాంధ్రలో విమాన రవాణాతో పాటు ప్రజా రవాణా వ్యవస్థ కూడా మరింత ఆధునికంగా మారనుందని అధికారులు భావిస్తున్నారు.



# ఈనెల 26న తెలంగాణకు అమిత్ షా

**కరీంనగర్‌లో పర్యటన, రాష్ట్ర నేతలతో కీలక భేటీ**

**హైదరాబాద్, మహా.** కేంద్ర హోంశాఖ మంత్రి, భారతీయ జనతా పార్టీ అగ్రనేత అమిత్ షా ఈ నెల 26న తెలంగాణలో పర్యటించనున్నారు. కరీంనగర్‌లో జరగనున్న ఓ ప్రైవేట్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. తెలంగాణలో పార్టీ బలోపేతంపై ఇప్పటికే ప్రత్యేక దృష్టి సారించిన కమలనాథులకు కేంద్ర హోంమంత్రి తాజా పర్యటన అత్యంత కీలకం కానుంది.

కరీంనగర్ పర్యటనలో భాగంగా స్థానికంగా జరిగే ఒక ప్రైవేట్ వేడుకలో అమిత్ షా పాల్గొంటారు. దేశ హోంమంత్రి రాక నేపథ్యంలో కరీంనగర్‌లో పోలీసు అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. వీవీఐపీ పర్యటన కావడంతో భద్రతాపరంగా ఎలాంటి లోపాలు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ఈ పర్యటన సందర్భంగా రాష్ట్ర బీజేపీ ముఖ్య నేతలతో అమిత్ షా ప్రత్యేకంగా సమావేశమయ్యే అవకాశం ఉందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలు, ప్రభుత్వ పనితీరు, రాబోయే రోజుల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ భేటీలో ఆయన రాష్ట్ర నేతలకు దిశానిర్దేశం చేయనున్నట్లు సమాచారం.

తెలంగాణలో అధికారమే లక్ష్యంగా బీజేపీ జాతీయ నాయకత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అమిత్ షా రాకకు ముందే దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, పార్టీ తెలంగాణ ఇన్‌ఛార్జ్ నితిన్ నబీన్ తదితర అగ్రనేతలు రాష్ట్రంలో పర్యటించి పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపారు. ఈ పర్యటనల ద్వారా రాష్ట్రంలో పార్టీ కార్యాచరణను అధిష్ఠానం మరింత వేగవంతం చేసింది.

మరోవైపు కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ తదితర కీలక నేతలతో అధిష్ఠానం ఎప్పటికప్పుడు మంతనాలు జరుపుతూ సమన్వయం చేసుకుంటోంది.

# దేశంలోనే తొలి సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ ప్రారంభం

**రాష్ట్రంలో 10 లక్షల ఎకరాలకు ఆయిల్ పామ్ విస్తరణే లక్ష్యం: డిప్యూటీ సీఎం భట్టి.**



**ఖమ్మం, మహా.** వ్యవసాయాన్ని పరిశ్రమలతో అనుసంధానం చేసి విలువ ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహించినప్పుడే రైతుల ఆదాయం స్థిరంగా పెరుగుతుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఖమ్మం జిల్లా కొణిజెర్ల మండలం అంజనాపురంలో తెలంగాణ ప్రభుత్వ సహకారంతో గోద్రెజ్ సంస్థ ఏర్పాటు చేసిన దేశంలోనే తొలి సమీకృత (ఇంటిగ్రేటెడ్) ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ కాంప్లెక్స్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, గోద్రెజ్ ఇండస్ట్రీస్ చైర్‌పర్సన్ నాదిర్ బి. గోద్రెజ్, గోద్రెజ్ ఆగ్రోవెట్ ఎండీ సునీల్ కటారియా, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్., పోలీస్ కమిషనర్ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఫ్యాక్టరీలోని ఉత్పత్తి విభాగాలు, ఆయిల్ పామ్ గెలల ప్రాసెసింగ్ యూనిట్లు, నాణ్యత నియంత్రణ వ్యవస్థను పరిశీలించిన అనంతరం జరిగిన సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఖమ్మం జిల్లా వ్యవసాయానికి చిరునామాగా నిలిచిందన్నారు. పాలేరు జలాశయం, నాగార్జునసాగర్ ఎడమ కాలువ, వైరా రిజర్వాయర్ ఈ ప్రాంత రైతులకు జీవనాధారమని పేర్కొన్నారు. సంప్రదాయ పంటలతో పాటు అధిక ఆదాయం అందించే ఆయిల్ పామ్ వంటి వాణిజ్య పంటల సాగును రైతులు విస్తరించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు చేపట్టే రైతులకు నాలుగేళ్ల కాలంలో ఎకరాకు సుమారు రూ.52 వేల వరకు ప్రోత్సాహకాన్ని అందిస్తోందని తెలిపారు. సూపర్ ఎల్‌నినో వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో కూడా ఆయిల్ పామ్ రైతులకు స్థిరమైన ఆదాయాన్ని అందిస్తుందని చెప్పారు. దేశంలో వంటనూనెల అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో దిగుమతులపై ఆధారపడకుండా దేశీయ ఉత్పత్తి పెంచేందుకు ఆయిల్ పామ్ సాగు విస్తరణ అత్యవసరమని పేర్కొన్నారు. ప్రస్తుతం వంటనూనెల దిగుమతుల కోసం ప్రతి సంవత్సరం సుమారు రూ.1.5 లక్షల కోట్ల విదేశీ మారక ద్రవ్యం వెచ్చిస్తున్నామని గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా ప్రస్తుతం సుమారు 15 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని, దేశ అవసరాలకు అనుగుణంగా దీన్ని 70 లక్షల ఎకరాలకు విస్తరించాల్సిన అవసరం ఉందని భట్టి చెప్పారు. 2023లో టన్ను ఆయిల్ పామ్ గెలల ధర రూ.12 వేలుగా ఉండగా ప్రస్తుతం రూ.23 వేల వరకు పెరగడం రైతులకు లాభదాయకంగా మారిందన్నారు. వంటనూనెతో పాటు సౌందర్య సాధనాల తయారీకి కూడా ఆయిల్ పామ్ ముడి పదార్థంగా ఉపయోగపడుతుందని వివరించారు. ఖమ్మం జిల్లాలో ఏర్పాటైన ఈ సమీకృత పరిశ్రమ రైతులకు, యువతకు వరంగా మారుతుందని పేర్కొన్న భట్టి, పరిశ్రమ ఏర్పాటుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన కృషిని ప్రత్యేకంగా అభినందించారు. పరిశ్రమకు అవసరమైన రహదారి మౌలిక వసతులను టీజీఐఐసీ ద్వారా త్వరలో కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఖమ్మంలో మరిన్ని వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి మిర్చి, పత్తి, వరి వంటి పంటలకు విలువ ఆధారిత ఉత్పత్తి కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని గోద్రెజ్ సంస్థను కోరారు. 113 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఈ సమీకృత కాంప్లెక్స్‌లో సీడ్ గార్డెన్, మిల్లింగ్ యూనిట్, రిఫైనరీ, నాణ్యత పరీక్షా కేంద్రం వంటి అన్ని సౌకర్యాలు ఒకే ప్రాంగణంలో ఏర్పాటు కావడం విశేషమని భట్టి పేర్కొన్నారు. గంటకు 60 నుంచి 120 టన్నుల ఆయిల్ పామ్ గెలలను ప్రాసెస్ చేసే సామర్థ్యం ఈ పరిశ్రమకు ఉందన్నారు. భవిష్యత్తులో ఆయిల్ పామ్ విత్తనాల కోసం విదేశాలపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా ఖమ్మమే దేశానికి కేంద్రంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థూల ఆర్థికోత్పత్తి రూ.17 లక్షల కోట్లకు చేరుకున్నప్పటికీ వ్యవసాయ రంగం వాటా కేవలం 15 శాతం మాత్రమే ఉందని, రైతుల ఆర్థిక స్థితి మెరుగుపడాలంటే విలువ ఆధారిత వ్యవసాయం, వాణిజ్య పంటలే శాశ్వత పరిష్కారమని తెలిపారు. ఇటీవల తొమ్మిది రోజుల్లో రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్ల పెట్టుబడి సాయం జమ చేసినట్లు వెల్లడించారు. నాగార్జునసాగర్, సీతారామ ఎత్తిపోతల పథకం, పాలేరు లింక్, ఎన్కూర్-రాజీవ్ లింక్ కాలువల ద్వారా లభించే నీటిని వినియోగించి ఉద్యాన పంటల సాగును మరింత విస్తరించాలని సూచించారు. కొణిజెర్లను రాష్ట్రంలోనే ప్రముఖ పారిశ్రామిక మండలంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం సుమారు 3 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని, రానున్న రెండు నుంచి మూడు సంవత్సరాల్లో దీన్ని 10 లక్షల ఎకరాలకు పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. ప్రతి 10 వేల ఎకరాల ఆయిల్ పామ్ సాగుకు ఒక ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ప్రస్తుతం తెలంగాణలో మూడు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలు పని చేస్తుండగా గోద్రెజ్ ఏర్పాటు చేసినది నాలుగో ఫ్యాక్టరీ అని చెప్పారు. త్వరలో మరో ఆరు ఫ్యాక్టరీలను కూడా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. దేశంలోనే తొలి ఆధునిక ఆయిల్ పామ్ సీడ్ గార్డెన్ ఖమ్మంలో ఏర్పాటవుతోందని తుమ్మల తెలిపారు. పరిశోధన కేంద్రం, శిక్షణా కేంద్రం, ప్రదర్శన విభాగాలు, నాణ్యమైన నర్సరీలు, రైతులకు అవసరమైన సాంకేతిక సేవలు ఒకే చోట అందుబాటులో ఉంటాయని చెప్పారు. శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేస్తే ఎకరాకు 15 నుంచి 16 టన్నుల వరకు గెలల దిగుబడి సాధ్యమవుతుందని వివరించారు. ఆయిల్ పామ్ తోటల్లో కంది, పత్తి, పప్పుధాన్యాలు వంటి అంతర పంటలు సాగు చేసి రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ కనీస మద్దతు ధరను పెంచాలని, దిగుమతులపై సుంకాలు విధించాలని రాష్ట్రం కోరుతోందన్నారు. వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్ మాట్లాడుతూ 'తెలంగాణ రైజింగ్-2047' విజన్‌లో భాగంగా ప్రస్తుతం 40 బిలియన్ డాలర్లుగా ఉన్న వ్యవసాయ రంగ ఆర్థిక విలువను 2047 నాటికి 400 బిలియన్ డాలర్లకు పెంచడమే లక్ష్యమన్నారు. గత మూడు సంవత్సరాల్లోనే రాష్ట్రంలో రెండు లక్షల ఎకరాలకు పైగా కొత్తగా ఆయిల్ పామ్ సాగులోకి రావడం దేశంలోనే అత్యధికమని చెప్పారు. గోద్రెజ్ ఇండస్ట్రీస్ చైర్‌పర్సన్ నాదిర్ బి. గోద్రెజ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. దేశం వంటనూనెల్లో స్వయం సమృద్ధి సాధించడంలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఆయిల్ పామ్ సాగులో మహిళలు మరింత చురుకుగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గోద్రెజ్ ఆగ్రోవెట్ ఎండీ సునీల్ కటారియా మాట్లాడుతూ ఖమ్మంలో ఏర్పాటైన సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ ద్వారా 700 మందికి పైగా ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఇదే ప్రాంగణంలో త్వరలో ఎడిబుల్ ఆయిల్ రిఫైనరీని కూడా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. నాణ్యమైన మొక్కల ఉత్పత్తి కోసం ఆధునిక సీడ్ గార్డెన్ ఏర్పాటు చేసి రైతులకు మెరుగైన నాట్లు అందించనున్నట్లు చెప్పారు. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా ఈ ప్రాంత రైతులు కోరుకున్న ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ కల నేడు సాకారమైందన్నారు. ఫ్యాక్టరీలో ఉద్యోగాల భర్తీలో స్థానిక యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని గోద్రెజ్ యాజమాన్యాన్ని కోరారు. దేశంలోనే తొలి సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ ప్రారంభంతో ఖమ్మం జిల్లా ఆయిల్ పామ్ రంగానికి జాతీయ కేంద్రంగా ఎదిగే దిశగా మరో కీలక అడుగు పడిందని ప్రభుత్వం, గోద్రెజ్ సంస్థ ప్రతినిధులు అభిప్రాయపడ్డారు.

# 6 నెలల్లో 554 మంది భర్తల మృతి

(మొదటి పేజీ తరువాయి )

ఏకం న్యాయ్ ఫౌండేషన్ అనే సంస్థ విడుదల చేసిన నివేదిక ద్వారా తెలుస్తోంది. ఈ గణాంకాలను కేవలం మీడియా కథనాల ఆధారంగా సేకరించామని ఫౌండేషన్ పేర్కొంది. దేశవ్యాప్తంగా భర్తలపై జరుగుతున్న హత్యలు, ఆత్మహత్యలపై గురుగ్రామ్‌కు చెందిన ఏకం న్యాయ్ ఫౌండేషన్ విడుదల చేసిన తాజా నివేదిక తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 2026 తొలి ఆరు నెలల్లో దేశవ్యాప్తంగా 554 మంది భర్తలు హత్యలు, ఆత్మహత్యలు చోటు చేసుకున్నట్లు ఏకం న్యాయ్ ఫౌండేషన్ సంస్థ వెల్లడించింది. అయితే ఇవి ప్రభుత్వ అధికారిక గణాంకాలు కాదని మీడియా కథనాలు, ఫౌండేషన్ సేకరించిన వివరాల ఆధారంగా రూపొందించిన డాక్యుమెంటేషన్ రిపోర్టు మాత్రమేనని స్పష్టం చేసింది. ఈ నివేదిక ప్రకారం.. మొత్తం 322 మంది భర్తలు హత్యకు గురయ్యారని, వీరిలో అత్యధిక కేసులు భార్యలు లేదా వారి వివాహేతర సంబంధాల నేపథ్యంలో జరిగిన కుట్రలతో ముడిపడి ఉన్నట్లు ఆ సంస్థ పేర్కొంది. మొత్తం హత్యల్లో 194 కేసులు (సుమారు 60.2 శాతం) వివాహేతర సంబంధాల కారణంగానే జరిగినట్లు ఆ రిపోర్టు వెల్లడించింది. భార్యలు, తమ ప్రియులతో కలిసి కట్టుకున్న భర్తలను హత్య చేసిన ఘటనలు ఎక్కువగా నమోదు అయ్యాయని ఆ నివేదిక తెలిపింది.అదే సమయంలో 232 మంది భర్తలు ఆత్మహత్యలకు పాల్పడినట్లు ఏకం న్యాయ్ ఫౌండేషన్ పేర్కొంది. వీటిలో కుటుంబ కలహాలు, గృహహింస, మానసిక వేధింపులు, తప్పుడు క్రిమినల్ కేసులు, పిల్లలను కలవనివ్వకపోవడం వంటి కారణాలు ప్రధానంగా ఉన్నాయని నివేదికలో వివరించింది. ఈ కేసుల్లో విషం పెట్టి చంపడం, గొంతు నులిమి



హత్య చేయడం, విద్యుత్ షాక్ పెట్టి హతమార్చడం, సజీవదహనం చేయడం, మృతదేహాలను ముక్కలు ముక్కలుగా నరకడం, చంపేసి ప్రమాదంగా లేదా ఆత్మహత్యగా చిత్రీకరించడం వంటి అత్యంత దారుణమైన నేరాలు నమోదు అయినట్లు ఆ నివేదిక తెలిపింది. రాష్ట్రాల వారీగా చూస్తే అత్యధికంగా 93 హత్యలు, 103 ఆత్మహత్యలతో ఉత్తరప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచినట్లు ఏకం న్యాయ్ ఫౌండేషన్ రిపోర్టు తెలిపింది. ఆ తర్వాత మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, మహారాష్ట్ర, హర్యానా, బీహార్, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లో కూడా ఇలాంటి కేసులు ఎక్కువగా నమోదు అయ్యాయని పేర్కొంది. ఈ నివేదికపై ప్రభుత్వ అధికారిక ధృవీకరణ లేదని ఆ సంస్థ స్పష్టం చేసింది. దేశంలో భర్తల హత్యలు లేదా పురుషులపై గృహహింసకు సంబంధించిన ప్రత్యేక జాతీయ డేటాబేస్ లేకపోవడంతో అసలు సంఖ్య మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఏకం న్యాయ్ ఫౌండేషన్ అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ సమస్య తీవ్రతను అంచనా వేయాలంటే అధికారిక గణాంకాల సేకరణ అవసరమని ఏకం న్యాయ్ ఫౌండేషన్ సంస్థ సూచించింది.

# క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లకు నేటి నుంచి దరఖాస్తులు

- **రూ.10 వేల టోకెన్‌తో నమోదు.. ఆగస్టు 10 వరకు అవకాశం.**

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో సొంత స్థలం లేని పేద కుటుంబాలకు బహుళ అంతస్తుల ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు ప్రక్రియకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకు సంబంధించిన వాట్సాప్ దరఖాస్తుల వ్యవస్థ, ఎల్ఐజీ గృహాల బ్రోచర్‌ను సోమవారం మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. జూలై 21 నుంచి ఆగస్టు 10 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, మీ సేవ కేంద్రాలు, ప్రత్యేక వెబ్‌సైట్, వాట్సాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు.

దరఖాస్తు చేసుకునే ప్రతి కుటుంబం రూ.10 వేల టోకెన్ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందని మంత్రి తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా డ్రా పద్ధతిలో పారదర్శకంగా జరుగుతుందని, డ్రాలో ఎంపిక కాకపోయిన వారి టోకెన్ మొత్తాన్ని పూర్తి స్థాయిలో తిరిగి చెల్లిస్తామని స్పష్టం చేశారు. ప్రతి కుటుంబం నుంచి ఒక్కరికి మాత్రమే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు.

క్యూర్ పరిధిలో ఇల్లు, స్థలం రెండూ లేని నిరుపేద కుటుంబాలకు తొలి విడతలో ప్రాధాన్యం ఇస్తామని మంత్రి వెల్లడించారు. లబ్ధిదారుల పేరునే స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయడంతో పాటు ప్రతి ఇంటికి రూ.5 లక్షల ప్రభుత్వ సబ్సిడీ అందజేస్తామని తెలిపారు. మిగిలిన మొత్తానికి బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రతి ఫ్లాట్ 528 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించబడుతుందని, ఆధునిక సౌకర్యాలతో కూడిన జీ ప్లస్ బహుళ అంతస్తుల భవనాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. తొలి దశలో హైదరాబాద్‌లోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 7,680 ఫ్లాట్ల నిర్మాణం చేపడుతున్నామని, అనంతరం మిగిలిన నియోజకవర్గాలకు కూడా పథకాన్ని విస్తరిస్తామని వెల్లడించారు. ప్రభుత్వ సబ్సిడీతో పొందిన ఫ్లాట్లను పదేళ్ల పాటు విక్రయించడానికి లేదా అద్దెకు ఇవ్వడానికి వీల్లేదని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే కేటాయింపును రద్దు చేసి, ఫ్లాట్‌ను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుంటుందని హెచ్చరించారు. ఈ చర్యలతో పథకం దుర్వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే రెండు విడతల్లో ఏడు లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, వాటిలో రెండు లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయ్యే దశలో ఉందని మంత్రి వెల్లడించారు. ఇప్పటి వరకు సొంత స్థలాలు ఉన్న పేదలకు ఇళ్లు మంజూరు చేశామని, ఇకపై స్థలం లేని పేదల ఇంటి కలను కూడా నెరవేర్చేందుకు క్యూర్ ప్రత్యేక గృహ పథకాన్ని ప్రారంభించామని చెప్పారు.

గత ప్రభుత్వ హయాంలో నగరానికి దూరంగా నిర్మించిన గృహ సముదాయాలు ప్రజలకు ఉపయోగపడలేదని విమర్శించిన మంత్రి, ఈసారి నగర కోర్ ప్రాంతాల్లోనే విలువైన ప్రభుత్వ భూములపై టవర్లు నిర్మించి పేదలకు ఇళ్లు అందజేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాళ్లతో ఉన్నప్పటికీ పేదల గృహ హక్కు విషయంలో ప్రభుత్వం రాజీపడబోదని పేర్కొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ గుడిసెలు లేని తెలంగాణ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఇళ్ల కేటాయింపులో పూర్తిస్థాయి పారదర్శకత పాటించడంతో పాటు రిజర్వేషన్ విధానాన్ని కూడా అమలు చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో నిర్మించిన హౌసింగ్ బోర్డు కాలనీల తరహాలోనే, మరింత ఆధునిక సౌకర్యాలతో ఈ గృహ సముదాయాలు రూపుదిద్దుకుంటాయని వెల్లడించారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం హౌసింగ్ విభాగాన్ని నిర్వీర్యం చేసిందని, తమ ప్రభుత్వం దానిని పునరుద్ధరించి పేదల గృహ నిర్మాణానికి కొత్త ఊపు తీసుకొచ్చిందని అన్నారు. బల్కంపేట ఎల్లమ్మ బోనాల సందర్భంగా ఈ పథకాన్ని ప్రారంభించడం శుభపరిణామమని పేర్కొంటూ, వచ్చే బోనాల నాటికి తొలి దశ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు.

# ప్రభుత్వ విద్యను ప్రైవేటీకరించే కుట్ర జరుగుతోంది

**తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం దానిని పూర్తిగా ప్రైవేటు సంస్థల చేతుల్లోకి నెట్టే కుట్ర చేస్తోందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. విద్యా కమిషన్ నివేదిక పేరుతో రాష్ట్రంలోని 27 వేల ప్రభుత్వ పాఠశాలలను కేవలం 4 వేలకే పరిమితం చేసే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ఈ విధానాన్ని తెలంగాణ రక్షణ సేన మొదటి నుంచే వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు.

సోమవారం మీడియాతో మాట్లాడిన కవిత, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ప్రాజెక్టుపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఒక్కో పాఠశాల నిర్మాణానికి సుమారు రూ.146 కోట్లు వెచ్చిస్తున్నారని, మొత్తం 72 పాఠశాలల నిర్మాణ వ్యయం దాదాపు రూ.11 వేల కోట్లకు చేరుతోందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్లలో అత్యధిక భాగం ఒకటి రెండు సంస్థలకే కట్టబెట్టారని ఆరోపించారు.

మొత్తం 72 పాఠశాలల్లో సగానికి పైగా నిర్మాణ పనులను మేఘా, కేఎంవీ సంస్థలకు అప్పగించారని కవిత పేర్కొన్నారు. టెండర్లలో 5 శాతం అధిక ధర (ఎక్సెస్ కోట్)ను ప్రభుత్వం అంగీకరించడం వల్ల రాష్ట్ర ఖజానాపై రూ.600 కోట్లకు పైగా అదనపు భారం పడుతోందని ఆరోపించారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం ప్రకటిస్తున్న రెండున్నరేళ్లలో ఈ పాఠశాలల నిర్మాణం పూర్తవడం ఆచరణ సాధ్యం కాదని కవిత అభిప్రాయపడ్డారు. రెవెన్యూ డివిజన్ స్థాయిలో పాఠశాలలు నిర్మిస్తే గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు అక్కడికి చేరుకోవడానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాల్సి వస్తుందని, ఆ రవాణా వ్యవస్థను కూడా అదే సంస్థలకు అప్పగించే అవకాశం ఉందని ఆరోపించారు. దీంతో ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలహీనపరుస్తూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రైవేట్ విద్యాసంస్థలకు రెడ్ కార్పెట్ పరుస్తున్నారని విమర్శించారు.

విద్యా రంగంతో పాటు సాగునీటి అంశంపైనా కవిత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. రైతుల సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, సాగునీటి సమస్యలపై రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని అన్నారు.

సింగరేణిలో మెడికల్ అన్‌ఫిట్ అయిన సుమారు రెండు వేల మంది కార్మికుల వారసులకు వెంటనే ఉద్యోగాలు కల్పించాలని కవిత డిమాండ్ చేశారు. మెడికల్ బోర్డును ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించకపోతే నిరవధిక నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు.

నిరుద్యోగ సమస్యపై స్పందించిన ఆమె, రాష్ట్రంలో 20 వేల కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. పరిమిత సంఖ్యలో ఉద్యోగాల భర్తీతో నిరుద్యోగులకు న్యాయం జరగదని, ప్రభుత్వం వెంటనే సమగ్ర జాబ్ క్యాలెండర్ విడుదల చేసి, ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ భృతిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీలపై కూడా కవిత విమర్శలు చేశారు. రైతులకు సాగునీరు, నిరుద్యోగులకు ఉద్యోగాలు, ప్రభుత్వ విద్య బలోపేతం వంటి అంశాల్లో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రచారానికే పరిమితమైందని విమర్శించారు.

అయితే కవిత చేసిన ఆరోపణలను అధికార కాంగ్రెస్ నాయకులు ఇప్పటికే ఖండించారు. బీఆర్ఎస్ అసత్య ప్రచారాలతో రైతులు, యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని, ప్రభుత్వ విద్యాభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కోసమే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ప్రాజెక్టును అమలు చేస్తున్నామని కాంగ్రెస్

# తెలంగాణ మెట్రో కు కేంద్రం షాక్

తెలంగాణలో కొత్త మెట్రో రైలు ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వలేదని కేంద్రం స్పష్టం

రాజ్యసభలో ఎంపీ ప్రశ్నకు కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ రాతపూర్వక సమాధానం

ఢిల్లీ, మహా : తెలంగాణలో కొత్తగా ఎటువంటి మెట్రో రైలు ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేయలేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. సోమవారం రాజ్యసభలో కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ఈ విషయాన్ని వెల్లడించారు. బీజేపీ ఎంపీ ఆర్. కృష్ణయ్య అడిగిన ప్రశ్నకు ఆయన రాతపూర్వక సమాధానం ఇచ్చారు.

దేశవ్యాప్తంగా 26 నగరాల్లో 1,159 కిలోమీటర్ల మేర మెట్రో నెట్‌వర్క్ ఉందని మంత్రి తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్ 1ను రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో అమలు చేసిందని, ఈ ప్రాజెక్టుకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కింద కేంద్రం రూ.1,204 కోట్లు విడుదల చేసిందని పేర్కొన్నారు. ఇదే క్రమంలో పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఎటువంటి మెట్రో ప్రాజెక్టులు అమలులో లేవని, అందువల్ల కేంద్రం నుంచి ఆర్థిక సాయం అందించలేదని కూడా స్పష్టం చేశారు.



హైదరాబాద్‌లో మెట్రో ఫేజ్ 2 విస్తరణ కోసం తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. శంషాబాద్ విమానాశ్రయం, ఐటీ హబ్స్, పాతబస్తీ మరియు శివారు ప్రాంతాలను కలుపుతూ పలు కారిడార్లలో విస్తరణ చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సంబంధించిన వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదికలను (డీపీఆర్) కూడా ఇప్పటికే కేంద్రానికి సమర్పించింది. ప్రాజెక్టు వ్యయాన్ని చెరిసగం పంచుకోవడానికి లేదా అవసరమైతే పూర్తి వ్యయాన్ని భరించడానికైనా సిద్ధంగా ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే ప్రకటించింది.

# రేవంత్ దార్శనికతకు కేంద్రం దన్ను



(మొదటి పేజీ తరువాయి)

శాఖ సహాయ మంత్రి ఇచ్చిన లిఖితపూర్వక సమాధానం తెలంగాణ భవిష్యత్తు ముఖచిత్రానికి అద్దం పడుతోంది. ఎక్కడా రాజకీయ విమర్శలకు తావివ్వకుండా, కేవలం ప్రాజెక్టుల పురోగతి, కేంద్రం అందిస్తున్న ప్రోత్సాహం, రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధి కలగలిపి తెలంగాణలో సరికొత్త ఎయిర్‌పోర్టుల కల సాకారమవుతున్న తీరు అత్యంత అద్భుతం.

**ఓరుగల్లుకు కొత్త రెక్కలు**

చారిత్రక నగరమైన వరంగల్ అభివృద్ధికి గీటురాయిగా మారనున్న మామునూరు విమానాశ్రయానికి కేంద్రం అత్యంత వేగంగా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ఈ ప్రకటనలో అత్యంత విశేషమైన అంశం. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన నిరంతర కృషి, పకడ్బందీ ప్రణాళికలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఈ విమానాశ్రయ అభివృద్ధికి అక్షరాలా రూ. 496.86 కోట్ల (జీఎస్టీతో కలిపి) అంచనా వ్యయానికి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) సూత్రప్రాయ ఆమోదం తెలపడం కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. నిధుల ఆమోదంతోనే ఆగిపోకుండా కాంపౌండ్ వాల్ నిర్మాణంతో పాటు రన్‌వే, అప్రాన్, టాక్సీవే వంటి కీలకమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఇప్పటికే ఏఏఐ టెండర్లు సైతం ఆహ్వానించింది. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం చకచకా భూసేకరణ ప్రక్రియను కొలిక్కి తీసుకువస్తుండగా, మరోవైపు కేంద్రం తనవంతుగా అనుమతుల ప్రక్రియను పరుగులెత్తిస్తోంది. ఈ సమన్వయం ఇలాగే కొనసాగితే అతి త్వరలోనే కాకతీయ గడ్డపైనుంచి వాణిజ్య విమానాలు ఎగరడం తథ్యం. ఇది వరంగల్ కేంద్రంగా ఐటీ, పారిశ్రామిక, పర్యాటక రంగాల దశదిశలను సమూలంగా మార్చనుంది.

**ఉత్తర తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చే ఆదిలాబాద్, పెద్దపల్లి ప్రాజెక్టులు**

రాష్ట్రంలో సమగ్ర, సమతుల్య అభివృద్ధి జరగాలన్న రేవంత్ రెడ్డి ఆలోచనా విధానానికి కేంద్రం అందిస్తున్న ప్రోత్సాహం ఉత్తర తెలంగాణకు ఒక పెద్ద వరంగా మారింది. ముఖ్యంగా ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని పౌర మరియు ఇతర అవసరాలకు వినియోగించే జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్‌గా అభివృద్ధి చేయడానికి ఏఏఐ ఇప్పటికే టెక్నోఎకనామిక్ ఫీజిబిలిటీ (సాంకేతిక, ఆర్థిక సాధ్యాసాధ్యాల) అధ్యయనాన్ని విజయవంతంగా పూర్తి చేసింది. ఇందుకు అవసరమైన భూమి వివరాలను కూడా కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి అందించగా, తెలంగాణ సర్కారు దానిపై యుద్ధప్రాతిపదికన కార్యాచరణ రూపొందిస్తోంది. అలాగే, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పెద్దపల్లిలో అత్యాధునిక గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలకు కేంద్రం అత్యంత సానుకూలంగా స్పందించింది. రికార్డు స్థాయిలో 2026 ఫిబ్రవరి నాటికే ప్రీఫీజిబిలిటీ అధ్యయన నివేదికను ఏఏఐ రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించి, ఈ బృహత్తర ప్రాజెక్టు పట్టాలెక్కేందుకు మార్గం సుగమం చేసింది. ఈ రెండు ఎయిర్‌పోర్టులు పూర్తయితే సింగరేణి, ఎన్టీపీసీ తదితర పారిశ్రామిక కారిడార్లకు జాతీయ స్థాయిలో అద్భుతమైన కనెక్టివిటీ లభిస్తుంది.

**కొత్తగూడెం ప్రతిపాదనలో శాస్త్రీయత, పారదర్శకత**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు విషయమై అటు రాష్ట్రం, ఇటు కేంద్రం అత్యంత పారదర్శకంగా, శాస్త్రీయంగా వ్యవహరిస్తున్న తీరు ముదావహం. 2025 జనవరిలో రామావరం, చుంచుపల్లి, సుజాతనగర్ గ్రామాల్లో చేసిన క్షేత్రస్థాయి సర్వేల ప్రకారం.. అక్కడ ఉన్న కొండలు, రైల్వే లైన్ల కారణంగా భౌగోళికంగా ఆ స్థలం విమానాశ్రయ నిర్మాణానికి అనువైనది కాదని ఏఏఐ నిపుణులు తేల్చారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం సాంకేతిక లోపాలున్న స్థలాల్లో ప్రాజెక్టులు చేపట్టి ప్రజాధనాన్ని వృథా చేయడం కంటే, శాస్త్రీయ అధ్యయనాల ద్వారా సరైన ప్రత్యామ్నాయాన్ని అన్వేషించడమే ఉత్తమం. ఈ నివేదిక రాష్ట్ర ప్రభుత్వానికి భవిష్యత్తులో సరైన స్థల ఎంపిక కోసం ఒక దిక్సూచిలా ఉపయోగపడనుంది. వాస్తవాలను దాచకుండా నిక్కచ్చిగా ప్రజల ముందు ఉంచడం పారదర్శక పాలనకు సంకేతం.

**సామాన్యుడికి చేరువగా విహాయసయానం**

కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'ఉడాన్' (ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్ ఉడాన్) పథకం కింద తెలంగాణలో ఇప్పటికే ఏకంగా 58 రూట్లను అందుబాటులోకి తెచ్చినట్లు కేంద్ర మంత్రి రాజ్యసభలో ప్రకటించడం సామాన్యుడికి సైతం విమానయానాన్ని చేరువ చేయడంలో ఇరు ప్రభుత్వాల ఉమ్మడి విజయానికి ప్రతీక. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రాన్ని ఒప్పించి, అవసరమైన డేటాను సమయానుకూలంగా అందించడం వల్లే ఈ అద్భుతమైన కనెక్టివిటీ సాధ్యమైంది. ఎయిర్‌పోర్టుల ఏర్పాటు కేవలం ప్రయాణ సౌకర్యం మాత్రమే కాదు, అది ఆ ప్రాంతపు సమగ్ర ఆర్థిక వికాసానికి ఒక బలమైన పునాది.

**రాజకీయాలకు అతీతమైన ప్రగతి యజ్ఞం**

ఒక రాష్ట్రం జాతీయ స్థాయిలో మరింత పటిష్టమైన ఆర్థిక శక్తిగా ఎదగాలంటే రోడ్డు, రైలు మార్గాలతో పాటు విమానయాన కనెక్టివిటీ అత్యంత కీలకం. ఈ సూత్రాన్ని బలంగా విశ్వసించిన సీఎం రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కేంద్రంతో సత్సంబంధాలు నెరపుతూ రాష్ట్ర ప్రయోజనాల కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఆయన పట్టుదల, వాస్తవిక డేటాతో కేంద్రం వద్ద వాదనలు వినిపించే తీరుకు కేంద్ర ప్రభుత్వం కూడా అంతే సానుకూలంగా, బాధ్యతాయుతంగా స్పందిస్తోంది. ఇదొక ఆరోగ్యకరమైన సహకార సమాఖ్యవాదం. ఈ రోజు వేస్తున్న ఈ బలమైన పునాదులు రేపటి తెలంగాణ ఆర్థిక ప్రగతికి బంగారు బాటలు వేస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. నాడు నిజాం కాలంలోనే విమానయానంలో ముందడుగు వేసిన తెలంగాణ ప్రాంతం, దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత మళ్లీ నేడు ద్వితీయ శ్రేణి నగరాల గగన వీధుల్లో విహరించేందుకు సగర్వంగా సిద్ధమవుతోంది.

# సభ్యులంతా సానుకూల దృక్పథంతో వ్యవహరించాలి

(మొదటి పేజీ తరువాయి)

గర్వకారణమని ప్రధాని పేర్కొన్నారు. ఆ సంస్థలో పనిచేస్తున్న యువ ఇంజినీర్ల సగటు వయస్సు కేవలం 28 సంవత్సరాలేనని చెబుతూ, “నేను మాట్లాడేది 28 ఏళ్ల యువత గురించి.. 56 ఏళ్ల యువకుడి గురించి కాదు” అని వ్యాఖ్యానించారు. ప్రధాని చేసిన ఈ వ్యాఖ్యలు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ఉద్దేశించినవేనని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. గత ఏడాది వర్షాకాల సమావేశాలకు ముందు భారతీయ వ్యోమగామి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్న విషయాన్ని గుర్తు చేసిన మోదీ, ఇప్పుడు భారత యువత రూపొందించిన ప్రైవేట్ రాకెట్ విజయవంతంగా ప్రయోగం కావడం దేశ సాంకేతిక సామర్థ్యానికి నిదర్శనమని కొనియాడారు. ప్రపంచంలో చాలా కొద్ది దేశాలకే ఇలాంటి సామర్థ్యం ఉందని, భారత యువత ఆ జాబితాలో దేశాన్ని నిలబెట్టిందని అన్నారు. ప్రస్తుత వర్షాకాలం వ్యవసాయ రంగానికి ఎంత కీలకమో, పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు దేశ ప్రజాస్వామ్యానికి అంతే ముఖ్యమని ప్రధాని పేర్కొన్నారు. మంచి వర్షాలు ఎలా ప్రజలకు మేలు చేస్తాయో, ఉత్పాదకంగా జరిగే పార్లమెంట్ సమావేశాలు కూడా దేశాభివృద్ధికి దోహదపడతాయని చెప్పారు. ఉభయ సభల్లో ప్రజా సమస్యలపై సార్థకమైన చర్చలు జరిగి, దేశ ప్రయోజనాలకు అనుకూలమైన నిర్ణయాలు వెలువడాలని ఆకాంక్షించారు. ఇదిలా ఉండగా, వర్షాకాల సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రతిపక్షాలు ఇప్పటికే వ్యూహాన్ని సిద్ధం చేశాయి. అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలు, నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీకేజీ, విద్యార్థుల ఆందోళనలు, నిరుద్యోగం, ప్రజా సమస్యలు వంటి అంశాలపై చర్చకు పట్టుబట్టనున్నాయి. నీట్ పేపర్ లీక్ అంశంపై చర్చించేందుకు ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ రూల్-267 కింద బిజినెస్ సస్పెన్షన్ నోటీసు ఇవ్వగా, కాంగ్రెస్ ఎంపీ రణదీప్ సింగ్ సుర్జేవాలా కూడా లోక్‌సభలో అడ్జర్న్‌మెంట్ మోషన్ నోటీసు సమర్పించారు. దీంతో అధికార, ప్రతిపక్షాల మధ్య తొలి రోజు నుంచే వాగ్వాదం కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆగస్టు 13 వరకు కొనసాగనున్న ఈ సమావేశాల్లో పలు కీలక బిల్లులను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. లోక్‌సభలో కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ సుప్రీంకోర్టు (సవరణ) బిల్లు-2026ను ప్రవేశపెట్టనున్నారు. ఈ బిల్లుతో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను ప్రస్తుతం ఉన్న 33 నుంచి 37కు పెంచే ప్రతిపాదనకు చట్టబద్ధత కల్పించనున్నారు. దీనితో పాటు ప్రశ్నోత్తరాల సమయం, సంతాప తీర్మానాలు, మంత్రుల ప్రకటనలు, వివిధ శాఖల నివేదికలను సభ ముందు ఉంచనున్నారు. రాజ్యసభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేషనల్ హానర్ (సవరణ) బిల్లు-2026ను ప్రవేశపెట్టనున్నారు. జాతీయ గీతం వందేమాతరంకు అవమానం కలిగించడం లేదా ఆలపించకుండా అడ్డుకోవడాన్ని శిక్షార్హమైన నేరంగా ప్రకటించేలా ఈ బిల్లులో నిబంధనలు ప్రతిపాదించారు. అలాగే గత సమావేశాల అనంతరం తీసుకొచ్చిన సుప్రీంకోర్టు (న్యాయమూర్తుల సంఖ్య) సవరణ ఆర్డినెన్స్-2026, ఆదాయపు పన్ను (సవరణ) ఆర్డినెన్స్-2026లను కూడా రాజ్యసభ ముందు ఉంచనున్నారు. ఈ సమావేశాల ద్వారానే ఇటీవల తృణమూల్ కాంగ్రెస్ నుంచి విడిపోయిన 20 మంది ఎంపీలతో ఏర్పడిన నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ) పార్లమెంటులో తొలి అడుగు పెట్టనుంది. కొత్త రాజకీయ సమీకరణాల నేపథ్యంలో ఈ పార్టీ వైఖరిపైనా ఆసక్తి నెలకొంది. పార్లమెంట్ తొలి రోజే ప్రభుత్వ అజెండా, ప్రతిపక్షాల దూకుడు స్పష్టమవడంతో రానున్న వారాల్లో నీట్ వివాదం, అయోధ్య విరాళాల ఆరోపణలు, చట్టసవరణ బిల్లులు, జాతీయ అంశాలపై ఉభయ సభల్లో తీవ్ర చర్చలు, వాగ్వాదాలు కొనసాగే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# యుద్ధ భయం

(మొదటి పేజీ తరువాయి)

ద్వారాలు తెరిచి ఉంచిన ఈ విచిత్ర యుద్ధ వాతావరణం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా సంచలనంగా మారింది.సోమవారం నాటి పరిణామాలను నిశితంగా పరిశీలిస్తే.. అమెరికా తన దాడుల తీవ్రతను ఏమాత్రం తగ్గించలేదు. ఇరాన్‌లోని అత్యంత కీలకమైన రేవు పట్టణం బుషెహర్‌ను టార్గెట్ చేసి అమెరికా దళాలు విరుచుకుపడ్డాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో భీకర దాడులు జరిగినట్లు స్థానిక గవర్నర్ ధ్రువీకరించారు. దీనివల్ల ఇరాన్ మౌలిక సదుపాయాలకు, సైనిక స్థావరాలకు భారీ నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి. కానీ ఇరాన్ కూడా చేతులు ముడుచుకుని కూర్చోలేదు. అమెరికాకు అండగా నిలుస్తున్న గల్ఫ్ దేశాలపై తన ప్రతాపాన్ని చూపిస్తోంది. బహ్రెయిన్, కువైట్ దేశాలను లక్ష్యంగా చేసుకుని ప్రతీకార దాడులకు దిగింది. అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి ముసుగులో తమ దేశ సార్వభౌమత్వానికి, భద్రతకు ముప్పు వాటిల్లితే చూస్తూ ఊరుకోబోమని ఇరాన్ అత్యంత కఠినమైన హెచ్చరికలు జారీ చేసింది.ఈ యుద్ధం వల్ల జరిగిన నష్టాలను, వాటి ప్రభావాలను విశ్లేషిస్తే పరిస్థితి యొక్క తీవ్రత స్పష్టంగా అర్థమవుతుంది. మొదటిది, బుషెహర్ లాంటి కీలక పోర్టులపై దాడుల వల్ల ఇరాన్ వాణిజ్య రవాణా వ్యవస్థ కుప్పకూలే ప్రమాదం ఏర్పడింది. రెండవది, బహ్రెయిన్, కువైట్ వంటి దేశాలపై దాడులు జరగడం వల్ల ఈ యుద్ధం కేవలం రెండు దేశాలకు పరిమితం కాకుండా మొత్తం పశ్చిమాసియాకు విస్తరించే భయం తలెత్తింది. మూడవది, హోర్ముజ్ జలసంధి గుండా జరిగే ప్రపంచ చమురు రవాణాకు తీవ్ర ఆటంకం ఏర్పడే అవకాశం ఉండటంతో గ్లోబల్ మార్కెట్లు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి. నాలుగవది, సైనిక స్థావరాల ధ్వంసం వల్ల ఇరు దేశాల రక్షణ



వ్యవస్థలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోంది. ఐదవది, రెండు వర్గాల దాడుల్లో సాధారణ పౌరుల ప్రాణ, ఆస్తి నష్టాలు భయాందోళనలు సృష్టిస్తున్నాయి. ఆరవది, నిరంతర పేలుళ్ల వల్ల మౌలిక సదుపాయాలు, విద్యుత్ కేంద్రాలు, రహదారులు భారీగా దెబ్బతిన్నాయి. ఏడవది, అమెరికా మిత్ర దేశాలలో సైతం అభద్రతా భావం పెరిగిపోయి వాణిజ్య పెట్టుబడులు వెనక్కి వెళ్లే పరిస్థితి దాపురించింది. ఎనిమిదవది, అంతర్జాతీయ విమానయాన సంస్థలు తమ రూట్లను మార్చుకోవాల్సి రావడంతో విమానయాన రంగంపై తీవ్ర ఆర్థిక ప్రభావం పడింది. తొమ్మిదవది, గల్ఫ్ దేశాల్లో పని చేస్తున్న లక్షలాది మంది వలస కార్మికుల భద్రత, వారి కుటుంబాల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. పదవది, అత్యాధునిక ఆయుధ సంపత్తి నాశనం కావడం వల్ల భవిష్యత్తులో ఈ దేశాలు తమ బడ్జెట్‌లో సింహభాగం రక్షణ రంగంపైనే ఖర్చు చేయాల్సిన దుస్థితి నెలకొంది.ఇంతటి వినాశకర పరిస్థితుల్లో మధ్యవర్తుల పాత్ర అత్యంత కీలకంగా మారింది. తెరవెనుక నడుస్తున్న ఈ దౌత్య ప్రయోగాలు, వాటి ఉపయోగాలు కూడా అనేక కోణాల్లో ఆశాజనకంగా కనిపిస్తున్నాయి. పదకొండవది, ప్రతిపాదించిన పది రోజుల విరామం అనేది ఇరు దేశాల సైన్యాలకు ఒక 'కూలింగ్ ఆఫ్ పీరియడ్' ఇస్తుంది, తద్వారా తక్షణ విధ్వంసం ఆగుతుంది. పన్నెండవది, తెగిపోయిన పాత శాంతి ఒప్పందాలను మళ్లీ చర్చల టేబుల్ మీదకు తీసుకురావడానికి ఇది ఒక అద్భుతమైన అవకాశంగా మారుతుంది. పదమూడవది, ఈ చర్చలు నిజంగా ఫలిస్తే రాబోయే గ్లోబల్ ఆయిల్ సంక్షోభం తృటిలో తప్పినట్లే. పద్నాలుగవది, దౌత్య మార్గాలు తెరిచి ఉంచడం వల్ల రెండు దేశాలు తమ ప్రతిష్ట దెబ్బతినకుండా ఒక గౌరవప్రదమైన రాజీకి వచ్చే వీలు కలుగుతుంది. పదిహేనవది, మధ్యవర్తులు ఇస్తున్న సమాచారాన్ని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బాఘే అధికారికంగా ధ్రువీకరించడం పరిస్థితి మెరుగుపడేందుకు ఒక బలమైన సానుకూల సంకేతం. పదహారవది, ఈ దౌత్య ప్రక్రియల వల్ల భవిష్యత్తులో విధ్వంసకర ఆయుధాల వినియోగం లాంటి విపత్కర నిర్ణయాలను నిలువరించవచ్చు. పదిహేడవది, యుద్ధంలో ఇరుక్కుపోయిన పౌరులకు ఆహారం, వైద్యం అందించేందుకు హ్యూమనిటేరియన్ కారిడార్ల ఏర్పాటుకు ఈ పది రోజుల విరామం ఎంతగానో ఉపయోగపడుతుంది. పద్దెనిమిదవది, అమెరికాలో పెరుగుతున్న అంతర్గత రాజకీయ ఒత్తిళ్లను, అలాగే ఇరాన్ నాయకత్వంపై ఉన్న ఆర్థిక ఒత్తిడిని తగ్గించడానికి ఈ దౌత్య మార్గం ఒక వారధిలా పనిచేస్తుంది. పంతొమ్మిదవది, హోర్ముజ్ జలసంధిలో మరింత ఉద్రిక్తత పెరగకుండా, స్వేచ్ఛా వాణిజ్యానికి ఈ బేరసారాలు ఒక అడ్డుకట్ట వేస్తాయి. ఇరవయ్యవది, ఈ దౌత్య యత్నాలు సఫలమైతే పశ్చిమాసియాలో పెను ముప్పు తప్పిపోయి శాశ్వత శాంతికి బీజాలు పడినట్లే అని అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు. యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ, దౌత్యం కూడా సమాంతరంగా సాగుతోందన్న వార్త ప్రపంచానికి ఒక అతిపెద్ద ఊరట!



## కారు బోల్తా యువకుడు మృతి

**కుషాయిగూడ, మహా :** మితిమీరిన వేగంతో వాహనాన్ని నడపడం వల్ల కారు అదుపుతప్పి కారు బోల్తా పడడం వల్ల యువకుడు మరణించిన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ హెచ్ఓ సైదులు తెలిపిన కథనం ప్రకారం, వెల్లంగుల వరుణ్ (22) 20వ తేదీ ఉదయం తెల్లవారు జామున సుమారు నాలుగు గంటలకు వరుణ్ తన స్నేహితులతో కలిసి కారులో వస్తుండగా యాప్రాల్ లోని ఓం శ్రీ సిగ్నెట్ అపార్ట్మెంట్ సమీపంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గోడను ఢీకొని కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వరుణ్ కు తీవ్ర గాయాలు కాగా కారులో ఉన్న వరుణ్ స్నేహితులు అలీ, అరుణ్ లకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు వరుణ్ ను అతని స్నేహితులు మరో కారులో చికిత్స నిమిత్తం మిలటరీ హాస్పిటల్ కు తరలిస్తుండగా వరుణ్ మార్గమధ్యలోనే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు వరుణ్ తండ్రి జవహర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## సింగరేణి సూపర్ బజార్ పునర్నిర్మాణం చేపట్టాలి

భద్రాద్రి కొత్తగూడెం, మహా: కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని రామవరం 16వ డివిజన్ లోని పాత సూపర్ మార్కెట్ ఏరియాలో నూతన బిల్డింగ్ నిర్మాణం చేసి రామవరం ప్రాంత అభివృద్ధికి సహకరించాలని రుద్రంపూర్ ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ షాలెం రాజుకి 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ సోమవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామవరం ప్రాంతం గతంలో సింగరేణి కార్మికులతో కలకలాడుతుండేదని ఆనాటి వైభవం నేడు లేదని అన్నారు. మరల పూర్వ వైభవం కోసం మార్కెట్ ఏరియాలో గల పాత సూపర్ మార్కెట్ లో నూతన భవనం నిర్మాణం చేపట్టి దానిలో సూపర్ మార్కెట్ నిర్మాణం చేపట్టాలని కోరారు. తద్వారా దాని చుట్టూ ఉన్నటువంటి కూరగాయలు పండ్లు పూలు ఇతర షాపులు నడుపుకునే వారికి జీవనోపాధికి ఉపయోగపడేటట్లుగా నిర్మాణం చేయడం ద్వారా చాలామందికి ఉపాధి మార్గాలు దొరుకుతాయని ఆమె వివరించారు. దీనిపై స్పందించిన జిఎం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ఇచ్చిన వినతి ప్రకారం కొత్తగూడెం, రామవరం సింగరేణి సూపర్ బజార్ల నిర్మాణం ఫైల్ అండర్ ప్రాసెస్ లో ఉందని జిఎం అన్నారని ఆమె తెలిపారు.

# సంతాన లక్ష్మీ ఎక్కడ?



కన్ను తెరిస్తే జననం... కన్ను మూస్తే మరణం... రెప్ప పాటు ఈ జీవనం అన్నారు ఓ మహా కవి. జీవితం గాలి బుడగ వంటిదని దాని అర్థం. జీవితంలో సాధించాల్సిన కార్యాలు అన్నీ వాయిదా వేయకుండా చేయాలి అనేది కూడా ఆ కవి మాటల్లోని మర్మం... బాల్యమంతా విద్యాతో గడిచిపోతుంది. డిగ్రీలు చేతికి వచ్చిన తర్వాత ఉద్యోగం కోసం వెతుకులాట తప్పదు. ఇక ఇంటి బాధ్యతలు సరే సరి. ఇవి అన్నీ పూర్తి చేసుకొని పెళ్లికి సిద్ధం కావటం ఓ మహాయజ్ఞం అవుతోంది. తీరా పెళ్లి చేసుకున్న తర్వాత బరువు, బాధ్యతలు చూసి ఇప్పుడే పిల్లలు వద్దనుకునే పరిస్థితి. దింతో ఇప్పుడు పెద్ద సమస్య వచ్చి పడింది. మన దేశంలో జనాభా పెరుగుదల రేటు అనూహ్యంగా పడిపోతూ వస్తోంది. ఇది అత్యంత ప్రమాదకర పరిణామం అంటున్నారు నిపుణులు. ఏ దేశానికి అయినా సహజ వనరులు ఎంత ముఖ్యమో, అంతే స్థాయిలో జనాభా పెరుగుదల కూడా అవసరం అంటున్నారు మేధావులు. మన దేశంలో జనాభా తగ్గటమా? నిజామా? అనే ఆశ్చర్యం కలుగకుండా ఉండదు. కానీ ఇది అక్షర సత్యం. దేశంలో జనాభా పెరుగుదల పెద్ద ఎత్తున తగ్గుముఖం పట్టిందని సర్వేలు స్పష్టంగా చెబుతున్నాయి. దేశంలోని దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా నియంత్రణ ఎక్కువ గా వుంది. ఇక ఉత్తరాది రాష్ట్రాల్లో కూడా ఇప్పుడు ఇదే విధానం మొదలు కావటంతో వచ్చే దశాబ్దం నాటికి దేశంలో భారీగా జననాల రేటు తగ్గిపోయే సూచనలు ఉన్నట్టు నిపుణులు చెప్పుతున్నారు. ఇది నమ్మలేని నిజమే...

ప్రపంచంలో అత్యధిక జనాభా వున్న దేశం భారతదేశం. జనాభాలో ఒకప్పుడు మొదటి స్థానంలో వుండే చైనా ఇప్పుడు రెండో స్థానంలోకి చేరింది. అక్కడ జనాభా పెరుగుదల కనిష్ఠ స్థాయికి చేరుకుంది. అసలు పెళ్లి చేసుకునే వారి సంఖ్య కూడా అక్కడ గణనీయంగా తగ్గిపోయింది. వంద మందిలో 32 మంది మాత్రమే పెళ్లి చేసుకోగా అందులో 12 మంది మాత్రమే సంతానం పైన మక్కువ చూపుతున్నారుట. వారు కూడా ఒక్క సంతానికే పరిమితం అవుతున్నారు. దింతో రెండు దశాబ్దాలుగా చైనాలో ఈ పరిస్థితి ఉండగా యువత సంఖ్య క్రమంగా తగ్గి వృద్ధుల సంఖ్య పెరిగింది. సంతానం కనే వారికి పెళ్లి చేసుకునే వారికి పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు ఇప్పుడు చైనా ప్రకటించటం గమనిస్తే అక్కడ జనాభా ఏ స్థాయిలో తగ్గిందో అర్థం చేసుకోవచ్చు. మనదేశంలోనూ ఇప్పుడు ఇవే పరిస్థితులు వస్తున్నట్లు నిపుణులు చెప్తుతున్నారు. యువతలో పెళ్లి పైన ఆసక్తి తగ్గటం, ఆలస్యంగా వివాహం, పిల్లలు ఇప్పుడే వద్దనుకోవటం వంటి కారణాల వల్ల దేశంలో జనాభా పెరుగుదల తగ్గుతూ వస్తోందని నిపుణులు అంటున్నారు. ఇదే విధానం మరో పదేళ్ల పాటు కొనసాగితే యువశక్తి కొరత దేశంలో ఏర్పడుతుందని అంటున్నారు.

దేశంలో మొత్తం జనాభా సుమారు 140 కోట్లు. నిమిషానికి దాదాపుగా 50 మరణాలు రికార్డ్ అవుతుండగా, 18 జననాలు నమోదు అవుతున్నాయి. జననాల విషయంలో గ్రామాల్లో 14 శాతం తగ్గి పోగా మరణాల శాతం 15 పెరిగింది. మరణాల రేటుతో పోలిస్తే జననాల శాతం వేగంగా తగ్గుతూ వస్తోంది. Ide ఆందోళన కలిగిస్తోంది అంటున్నారు నిపుణులు. జననాల రేటు మరణాల రేటులో రెండు, మూడు శాతం కన్నా తేడా ఉండటం సంక్షోభానికి సంకేతంగా వాళ్ళ చెప్పుకొస్తున్నారు. దేశంలో జననాల రేటు పెరగాలి అంటే యుక్త వయసులోనే యువత పెళ్లిళ్లు చేసుకోవాలి. కుటుంబ నియంత్రణ కొంత కాలం వాయిదా వేయాలి. కానీ నేటి యువత పెళ్లిళ్లు ఆలస్యంగా చేసుకోవటంతో పాటు అసలు సంతానం పైన ఆసక్తి చూపడం లేదని ఓ సర్వే వివరించింది. ఇదే దేశంలో ఒక్కసారిగా జననాల రేటును తగ్గించి వేసింది. యువకులు 35 సంవత్సరాలు, యువతులు 30 నుంచి 32 సంవత్సరాల వరకు వివాహం పైన ఆలోచనలు చేయటం లేదు. మరోవైపు డేటింగ్ కు యువత అధిక ప్రాధాన్యత ఇస్తున్న వైనం ఇప్పుడు మరో సమస్య అవుతోంది. మన దేశలో 15 శాతానికి పైగా యువత డేటింగ్ లోనే జీవితం గడిపేస్తుండటం గమనార్హం.తెలుగు రాష్ట్రాలోనూ జనన, మరణాల రేటులో భారీ వ్యత్యాసం చోటు చేసుకుంటోంది. 2024 వరకు ఆంధ్రప్రదేశ్ లో సుమారుగా ఏడు లక్షల జననాలు నమోదు కాగా అయిదు లక్షల వరకు మరణాలు నమోదు అయ్యాయి. ఏపీలో వృద్ధుల సంఖ్య గణనీయంగా పెరుగుతూ వస్తోంది. మరణాల్లో 70 ఏళ్లు పై బడిన వారే అధికంగా వున్నారు. ఇక సగటున వేయి మంది మగ పిల్లలు జననం జరిగితే 930 మంది ఆడ పిల్లలు పుట్టినట్టు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. తెలంగాణలో రమారమి ఎనిమిది లక్షల జానాలు జరగ్గా మూడు లక్షల మరణాలు నమోదు అయ్యాయి. వేయి మంది మగ పిల్లల జనాలకు 937 మంది ఆడ పిల్లల జననాలు ఉన్నట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.ఇదే పద్ధతి కొనసాగితే తెలుగు రాష్ట్రాల్లో జనాభా తగ్గుదల ఇబ్బంది తెచ్చే పరిస్థితి ఏర్పడుతుంది. అత్యాధునిక వైద్యం అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో మరణాల రేటు తగ్గుతూ వస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో యువత 37 శాతం ఉంటే వయో వృద్ధుల శాతం 43 కు చేరుకుంది.దేశవ్యాప్తంగా జననాల రేటు తగ్గుదల వెనుక అనేక కారణాలు ఉన్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా విద్యా, వైద్యం, సాంకేతిక విస్ఫోటనం ప్రజలకు బాగా చేరువ అయ్యాయి. ప్రజలలో అప్రమత్తత పెరిగింది. ఆలోచనలో మార్పులు వచ్చాయి. మరో వైపు జీవన వ్యయం కూడా పెరుగుతూ వస్తోంది. ఉద్యోగాలు, ఉపాధి రంగాల్లో స్థిరత్వ ధోరణి ఎక్కువ అయింది. తమకు వచ్చే ఆదాయంతో ఎంత మేరకు నెట్టుకు రాగలం అనే లెక్కలు వేసుకునే వారి సంఖ్య ఎక్కువ అయింది. దింతో జీవితంలో స్థిర పడే వరకు వివాహం వైపు యువత ఆలోచనలు చేయటం లేదు. యువకుల్లో 35 సంవత్సరాల వయసు వచ్చిన తర్వాతనే పెళ్లి ఆలోచనలు చేస్తున్నారు. ఇక యువతుల్లో కూడా ఇలాంటి ఆలోచనలే వుంటున్నాయి. 30 సంవత్సరాల వయసు వరకు జీవిత లక్ష్య సాధనల పైనే వారు దృష్టి పెడుతున్నారు. ఉద్యోగాలు చేస్తున్నారు. తమ స్థాయికి తగిన వరుడు కోసం వేచి చూస్తున్నారు. ఇలా కాలం కరిగిపోతూ వస్తోంది. యువతుల పేరెంట్స్ కూడా తమ పిల్లలకు యుక్త వయసులో పెళ్లి చేసే విధానం మార్చుకున్నారు. అమ్మాయి సంపాదన పైన ఆశలు పెట్టుకుంటున్న పేరెంట్స్ వచ్చిన సంబంధాలకు వంకలు పెట్టటం కూడా యువతుల పెళ్లిళ్లు ఆలస్యంగా జరిగేందుకు ఓ కారణం అవుతోంది. ఓ స్థాయి వరకు చదువుకున్న యువకులు, యువతులు వివాహం చేసుకున్నా వెంటనే సంతానం వద్దని అనుకుంటున్నారు. ఆధునిక విధానంలో కుటుంబ నియంత్రణ సౌకర్యం ఇప్పుడు అందుబాటులో ఉండటంతో వాటినే పాటిస్తూ వస్తున్నారు. 40 ఏళ్ల వయసులో పిల్లలు కోరుకుంటున్న వారి సంఖ్య దేశంలో 27 శాతం మేరకు ఉందని చెబుతున్న సర్వేలు ఈ వయసులో సంతానం కోసం చేసే ప్రయత్నంలో సగం మంది మాత్రమే సఫలం అవుతున్నట్టు తెలిపింది. ఇక మన దేశంలో ఒక్క సంతానం మేరకు పరిమితం అయిన వారి శాతం 46 గా తాజా సర్వేలు చెబుతున్నాయి. విదేశీ అలవాట్లు కూడా సంతానం లేమికి గొడ్డలి పెట్టుగా మారాయి.గంపెడు పిల్లలతో వర్ధిల్లాలి అంటూ ఒకప్పుడు పెద్దలు కొత్త దంపతులకు ఆశీస్సులు అందించే వారు. ఆ దీవెనలు ఫలితం కూడా ఇచ్చేవి. పిల్ల, పాపలతో ఉమ్మడి కుటుంబాలు కనిపించేవి. ఇప్పుడు చాలా ప్రాంతాల్లో దంపతులు మాత్రమే కనిపిస్తున్నారు. మహా అయితే ఒక్క సంతానం. అంతకు మించి ఎక్కడ పెద్ద కుటుంబం మచ్చుకైనా కనిపించడం లేదు. ఇప్పుడు ట్రెండ్ మారింది. పిల్లలు వద్దు. లైఫ్ ఎంజాయ్ చేద్దాం. అనే వారి సంఖ్య పెరిగింది. ఇదే చివరికి డేటింగ్ కు దారి తీస్తోంది. హైదరాబాద్, ముంబై, చెన్నై, పూణే, కోల్కతా, బెంగళూరు వంటి నగరాల్లో ఈ సంస్కృతి ఇప్పుడు ఫ్యాషన్ అయింది. పిల్లలు కూడా పేరెంట్స్ మాట వినే పరిస్థితి లేదు. పెద్ద చదువులు, ఉద్యోగాలు, హోదా ముందు కుటుంబ వ్యవస్థ, సంప్రదాయం, కట్టుబాట్లు కనుమరుగయ్యే రోజులు వచ్చేశాయి. పేరెంట్స్ అత్యాశ పిల్లల పెళ్లిళ్ల వయసును గుర్తించక పోవటంతో యువత ఆలోచన ధోరణి మారిపోయింది. ఇప్పుడు అంతా న్యూ ట్రెండ్. నచ్చిందే చేస్తాం. మాకు నచ్చితేనే చేస్తాం... ఇది ఇప్పుడు యువత మాట. బాట. ఇదే పరిస్థితి కొనసాగితే దేశంలో సంతాన లక్ష్మిలు ఇక కనిపించరు. మన దేశ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార, వ్యవహారాలు విదేశీయులు అత్యంత ఇష్టంతో అందిపుచ్చుకుంటుండగా మన వాళ్ళు మాత్రం వాటిని తోసి పుచ్చుతున్నారు. కాలం మారింది. మనం మారాలి అంటూ నెట్టుకు రావటం తప్పా ఇప్పుడు చేసేది ఏమి లేదు.



**జీ. వెంకటరమణ**
**సీనియర్ జర్నలిస్ట్**



# ఆరోపణలకు అతీతం - ఆచరణలో అద్భుతం

భారతదేశ సామాజిక, సాంస్కృతిక, జాతీయ జీవనంలో 'రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్' ఒక సువర్ణ అధ్యాయం. 1925 విజయదశమి రోజున డాక్టర్ కేశవ బలిరాం హెడ్గేవార్ గారి చేతుల మీదుగా రూపుదిద్దుకున్న ఈ సంస్థ, నేడు వందేళ్ల చారిత్రక ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుంటోంది. 1947 దేశ విభజన సమయంలో శరణార్థులకు అండగా నిలవడం నుండి, నాటి ప్రధాని నెహ్రూ ప్రత్యేక ఆహ్వానం మేరకు 1963 గణతంత్ర దినోత్సవ పెరేడ్‌లో పాల్గొనడం, అలాగే 1975 ఎమర్జెన్సీ చీకటి రోజుల్లో ప్రజాస్వామ్య పునరుద్ధరణకై అసమాన పోరాటం చేయడం వరకు.. ఆరెస్సెస్ జాతి నిర్మాణంలో ఒక మహా గంగా ప్రవాహంగా నిలబడింది. శతాబ్ది కాలంలో సమాజంలోని ప్రతి రంగాన్ని స్పృశిస్తూ 'సంఘ్ పరివార్'గా విస్తరించిన ఈ నెట్‌వర్క్ ప్రపంచ సంస్థాగత చరిత్రలోనే ఒక అద్భుతం. అయితే, ఇంత పెద్ద వ్యవస్థను నడుపుతున్న ఆరెస్సెస్ ఎందుకు రిజిస్టర్ కాలేదు, అది చట్టవిరుద్ధమా అని కొందరు తరచూ ప్రశ్నిస్తుంటారు. ఇలాంటి నిరాధారమైన సందేహాలను, భావోద్వేగాలను పక్కనపెట్టి, రాజ్యాంగం, చట్టాలు, సంస్థాగత వ్యూహాల ఆధారంగా వాస్తవాలను లోతుగా విశ్లేషించాల్సిన అవసరం ఉంది.ఆరెస్సెస్ కేవలం ఒక సంస్థ కాదు, అదొక సువిశాల ఆలోచనా విధానం, ఒక సాంస్కృతిక జాతీయవాద ప్రవాహం. ఈ మూల వృక్షం నుండి పుట్టుకొచ్చిన శాఖలే 'సంఘ్ పరివార్'. సమాజంలోని ఏ ఒక్క వర్గాన్ని వదలకుండా, ప్రతి అంగానికి ఒక నిర్దిష్ట వేదికను ఏర్పాటు చేసి నిస్వార్థంగా పనిచేయడం ఈ వ్యవస్థ ప్రత్యేకత. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలకమైన రాజకీయ రంగంలో జాతీయవాద భావజాలంతో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) పనిచేస్తుండగా, విద్యార్థులలో జాతీయ భావాన్ని, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థగా అవతరించింది. అలాగే ధర్మ రక్షణకై బజరంగ్ దళ్, మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపేందుకు దుర్గా వాహిని విశేష కృషి చేస్తున్నాయి. విద్యా రంగంలో చూస్తే, ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత విద్య వరకు విస్తరించిన అతిపెద్ద ప్రైవేట్ పాఠశాలల నెట్‌వర్క్ 'విద్యా భారతి' నైతిక విలువలతో కూడిన ఆధునిక విద్యను అందిస్తోంది. జాతీయవాద మేధావుల కోసం ప్రజ్ఞా ప్రవాహ్, వక్రీకరణలకు గురైన చరిత్రను శాస్త్రీయంగా సరిదిద్దేందుకు ఇతిహాస్ సంకలన్ యోజన, విద్యాభివృద్ధికై ఆర్ష విద్యా సమాజ్, పూర్వ విద్యార్థుల సమ్మేళనంగా పూర్వ ఛాత్ర పరిషత్ వంటివి నిరంతరం శ్రమిస్తున్నాయి.

సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా సేవా భారతి మురికివాడల్లో సేవలందిస్తుండగా, వనవాసి కల్యాణ్ ఆశ్రమం మారుమూల అటవీ ప్రాంతాల్లో గిరిజనుల విద్య, వైద్యం కోసం దశాబ్దాలుగా పనిచేస్తోంది. దివ్యాంగుల సాధికారతకు సక్షమ్, మాజీ సైనికుల సంక్షేమానికి పూర్వ సైనిక్ సేవా పరిషత్, సామాజిక చైతన్యానికి వివేకానంద కేంద్ర, రాష్ట్రోత్థాన పరిషత్, భారత్ వికాస్ పరిషత్ వంటి సంస్థలు తమవంతు పాత్ర పోషిస్తున్నాయి. మరోవైపు ఆర్థిక, కార్మిక, వ్యవసాయ రంగాల్లో సైతం సంఘ్ పరివార్ ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. వర్గపోరాటానికి బదులు జాతీయ శ్రేయస్సే ధ్యేయంగా భారతీయ మజ్దూర్ సంఘ్ అతిపెద్ద కార్మిక సంఘంగా ఎదిగింది. రైతుల హక్కుల కోసం భారతీయ కిసాన్ సంఘ్, ఆర్థిక స్వయం సమృద్ధి కోసం స్వదేశీ జాగరణ్ మంచ్, చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధికి లఘు ఉద్యోగ్ భారతి, వినియోగదారుల హక్కులకై అఖిల భారతీయ గ్రాహక్ పంచాయత్ అహర్నిశలు శ్రమిస్తున్నాయి.

భారతీయ వారసత్వ సంపదను, ధర్మాన్ని కాపాడేందుకు విశ్వ హిందూ పరిషత్ అంతర్జాతీయ స్థాయిలో పనిచేస్తుండగా, కళాకారుల కోసం సంస్కార్ భారతి, ప్రాచీన సంస్కృత భాషా వ్యాప్తికి సంస్కృత భారతి, ధార్మిక అవగాహనకై ధర్మ జాగరణ్ సమితి విశేష కృషి చేస్తున్నాయి. సాహిత్య రంగంలో అఖిల భారతీయ సాహిత్య పరిషత్, విజ్ఞాన రంగంలో ఆధునికతను ప్రాచీనతతో మేళవించే విజ్ఞాన భారతి తమదైన ముద్ర వేశాయి. మహిళల్లో నాయకత్వ లక్షణాల కోసం రాష్ట్ర సేవికా సమితి, విచ్ఛిన్నమవుతున్న ఉమ్మడి కుటుంబ వ్యవస్థను కాపాడేందుకు కుటుంబ ప్రబోధన్ సమాజాన్ని మేల్కొల్పుతున్నాయి. ఆరోగ్య రంగంలో యోగా, ఆయుర్వేదాల కోసం ఆరోగ్య భారతి, గ్రామీణ వైద్య సేవలకై నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్, న్యాయ నిపుణుల కోసం అధివక్త పరిషత్, క్రీడా స్ఫూర్తికి క్రీడా భారతి వంటివి ఉద్భవించాయి. దేశ సరిహద్దులు దాటి, విదేశాల్లోని భారతీయులను ఏకం చేసేందుకు హిందూ స్వయంసేవక్ సంఘ్, ప్రపంచవ్యాప్తంగా విపత్తుల సమయంలో సేవలందించేందుకు సేవా ఇంటర్నేషనల్ వంటి వేదికలు విస్తరించాయి.

సమాజంలోని ఇన్ని రంగాల్లో ఇంత శక్తివంతంగా పనిచేస్తున్న ఈ మూల సంస్థ ఎందుకు రిజిస్టర్ కాలేదు అన్న ప్రశ్నకు భారత రాజ్యాంగంలోనే స్పష్టమైన సమాధానం ఉంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(c) దేశంలోని ప్రతి పౌరుడికి సంఘాలు లేదా సంస్థలు ఏర్పాటు చేసుకునే ప్రాథమిక హక్కును ప్రసాదించింది. సొసైటీస్ రిజిస్ట్రేషన్ యాక్ట్ కింద నమోదు కావాలనేది కేవలం ఒక చట్టపరమైన అవకాశం మాత్రమే కానీ, రాజ్యాంగపరంగా అది తప్పనిసరి నిబంధన ఏమాత్రం కాదు. ఆరెస్సెస్ అనేది స్వచ్ఛంద కార్యకర్తలతో నడిచే ఒక అద్భుతమైన సామాజికసాంస్కృతిక ఉద్యమం. చట్టపరమైన పరిభాషలో దీనిని 'బాడీ ఆఫ్ ఇండివిడ్యువల్స్' (స్వచ్ఛంద వ్యక్తుల సమూహం) అని అంటారు. దీనికి రుసుముతో కూడిన సభ్యత్వం ఉండదు, అధికారిక గుర్తింపు కార్డులు ఉండవు. దేశభక్తికి రిజిస్ట్రేషన్ అవసరం లేదని, నిస్వార్థ సేవ చేయడానికి ఐడీ కార్డులు అవసరం లేదన్నదే ఆరెస్సెస్ ప్రాథమిక సిద్ధాంతం. ప్రభుత్వ నిధులు, గ్రాంట్లు ఆశించని ఏ సేవా సమూహమైనా రిజిస్ట్రేషన్ లేకుండానే రాజ్యాంగబద్ధంగా పనిచేయవచ్చు. వందేళ్లుగా ఈ స్వేచ్ఛను ఆరెస్సెస్ పూర్తి పారదర్శకతతో సద్వినియోగం చేసుకుంటోంది.

చట్టపరంగా ఒక సంస్థ రిజిస్టర్ కాకపోతే తన పేరు మీద ఆస్తులు, బ్యాంక్ ఖాతాలు కలిగి ఉండలేదనేది వాస్తవం. సరిగ్గా ఇక్కడే ఆరెస్సెస్ సంస్థాగత మేధస్సు, జవాబుదారీతనం ఇనుమడింపజేసే వ్యూహం ద్యోతకమవుతుంది. ఆరెస్సెస్ మూల సంస్థ నేరుగా ఏ ఆస్తినీ, బ్యాంకు ఖాతాలనూ తన ఆధీనంలో ఉంచుకోదు, దాని ఏకైక ఆస్తి నిస్వార్థ స్వయంసేవకులు మాత్రమే. కానీ దేశవ్యాప్తంగా నడిచే వేలాది పాఠశాలలు, ఆసుపత్రులు, సేవా కేంద్రాల నిర్వహణ కోసం 'సంఘ్ పరివార్' అనుబంధ సంస్థలను అది చట్టబద్ధంగా రిజిస్టర్ చేసింది. విద్యా భారతి, సేవా భారతి వంటి సేవా సంస్థలన్నీ చట్టబద్ధంగా నమోదైన ట్రస్టులు లేదా సొసైటీలుగా పనిచేస్తూ పక్కాగా బ్యాంక్ ఖాతాలు నిర్వహిస్తాయి, ప్రతి రూపాయినీ ఆడిట్ చేయించి ఆదాయపు పన్ను శాఖకు పారదర్శకంగా లెక్కలు చూపుతాయి. అలాగే రాజకీయ వేదికైన బీజేపీ కేంద్ర ఎన్నికల సంఘం వద్ద, విశ్వ హిందూ పరిషత్ సంబంధిత చట్టాల కింద పక్కాగా నమోదైన సంస్థలే.

కాబట్టి ఆరెస్సెస్ రిజిస్టర్ కాలేదు కాబట్టి చట్టవిరుద్ధం అనడం కేవలం అవగాహన లోపమే. ఒకవైపు రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛను గౌరవిస్తూనే, మరోవైపు సమాజంలోని ప్రతి వర్గాన్ని కలుపుకుపోతూ ఆరెస్సెస్ నిర్మించిన ఈ వ్యవస్థాగత చట్రం నిజంగా ఒక నిశ్శబ్ద విప్లవం. ఆస్తుల కోసం కాకుండా ఆదర్శాల కోసం, స్వార్థం కోసం కాకుండా పరమార్థం కోసం పనిచేసే ఇలాంటి వ్యవస్థ ప్రపంచ చరిత్రలో మరొకటి లేదు. ఈ వందేళ్ల స్ఫూర్తిదాయక ప్రస్థానమే దీనికి నిలువెత్తు నిదర్శనం.


భారత్ మాతా కీ జై.

**(శివకుమార్ గనివాడ, సీనియర్ సామాజిక విశ్లేషకులు)**

# నీటిలోనే అపార శక్తి

- **100 ఏళ్ల మిస్టరీని ఛేదించానన్న భారత సంతతి శాస్త్రవేత్త.**
- **ప్రపంచ శాస్త్రవేత్తల్లో ఆసక్తి రేకెత్తించిన యోగేంద్ర నారాయణ్ శ్రీవాత్సవ ప్రకటన.**





**ఢిల్లీ, మహా.:** మానవాళి భవిష్యత్తు ఇంధన అవసరాలను తీర్చగల అపార శక్తి నీటిలోనే దాగి ఉందని భారత సంతతికి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త యోగేంద్ర నారాయణ్ శ్రీవాత్సవ చేసిన ప్రకటన శాస్త్ర ప్రపంచంలో చర్చనీయాంశంగా మారింది. దాదాపు శతాబ్ద కాలంగా శాస్త్రవేత్తలకు అంతుచిక్కని ఒక ప్రయోగ రహస్యాన్ని తాను ఛేదించానని ఆయన ప్రకటించారు. తన సిద్ధాంతం ప్రయోగాల్లో నిజమని తేలితే, బొగ్గు, చమురు, యురేనియం వంటి సంప్రదాయ ఇంధనాలపై ఆధారపడకుండా సాధారణ నీటితోనే కాలుష్యరహిత విద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశాలు ఏర్పడతాయని ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ వాదనకు ఇంకా స్వతంత్ర శాస్త్రీయ ధ్రువీకరణ లభించలేదు.

ఈ మిస్టరీకి మూలం దాదాపు వందేళ్ల క్రితం జరిగిన ప్రయోగాల్లో ఉంది. నీటిలోకి అధిక శక్తితో కూడిన విద్యుత్ స్పార్క్ పంపినప్పుడు భారీ విస్ఫోటనం సంభవించి, దట్టమైన పొగమంచులా నీటి తుంపర్లు అన్ని వైపులా ఎగిసిపడినట్లు శాస్త్రవేత్తలు గమనించారు. మొదట ఇది నీరు ఆవిరిగా మారడం వల్లే జరిగిందని భావించినా, నీటి ఉష్ణోగ్రత ఆ స్థాయికి పెరగకపోవడంతో ఆ వివరణ సరిపోలేదు. ఆ తర్వాత జరిగిన అనేక ప్రయోగాల్లోనూ ఇదే తరహా ఫలితాలు రావడంతో అదనపు శక్తి ఎక్కడి నుంచి వస్తోందన్న ప్రశ్నకు సమాధానం దొరకలేదు.

1980లలో అమెరికాలోని ఎంఐటీలో నిర్వహించిన మరో ప్రయోగంలో రెండు టీ స్పూన్ల ఉప్పునీటిలోకి విద్యుత్ స్పార్క్ పంపగా మళ్లీ భారీ విస్ఫోటనం జరిగింది. గంటకు సుమారు 3,600 కిలోమీటర్ల వేగంతో ఎగిసిన నీటి తుంపర్లు సమీపంలోని అల్యూమినియం పలకను ఛేదించినట్లు నమోదైంది. అయినప్పటికీ నీటి ఉష్ణోగ్రతలో పెద్దగా మార్పు కనిపించలేదు. 2000లో శాస్త్రవేత్తలు పీటర్, నీల్ గ్రేనో నిర్వహించిన ప్రయోగాల్లో కూడా ఇదే తరహా ఫలితాలు వెలుగు చూశాయి. ప్రయోగంలో నీటికి అందించిన విద్యుత్ శక్తికంటే విస్ఫోటనం ద్వారా వెలువడిన శక్తి ఎక్కువగా నమోదవడంతో భౌతిక శాస్త్రంలోని శక్తి నిత్యత్వ నియమం (Law of Conservation of Energy)తో ఈ ఫలితాలు ఎలా సరిపోతాయన్నది శాస్త్రవేత్తలకు మిస్టరీగా మారింది.

ఈ ప్రశ్నకే తాను సమాధానం కనుగొన్నానని యోగేంద్ర నారాయణ్ శ్రీవాత్సవ చెబుతున్నారు. ఆయన వివరణ ప్రకారం, నీటి అణువులను పరస్పరం కలిపి ఉంచే హైడ్రోజన్ బంధాలు లాగి ఉంచిన రబ్బరు బ్యాండ్ల మాదిరిగా తమలో శక్తిని నిల్వ ఉంచుతాయి. అధిక శక్తి గల విద్యుత్ స్పార్క్ తగిలినప్పుడు ఈ బంధాలు ఒక్కసారిగా తెగిపడి, వాటిలో దాగి ఉన్న శక్తి విడుదలవుతుందని ఆయన సిద్ధాంతం ప్రతిపాదిస్తోంది. ఈ నమూనా ఆధారంగా తాను చేసిన గణనలు గతంలో నమోదైన ప్రయోగ ఫలితాలతో సరిపోలాయని ఆయన పేర్కొన్నారు.

ఈ సిద్ధాంతం శాస్త్రీయంగా నిరూపితమైతే ప్రపంచ ఇంధన రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నీటినే ప్రధాన వనరుగా ఉపయోగించి పరిశుభ్రమైన విద్యుత్ ఉత్పత్తి చేయగలిగితే కార్బన్ ఉద్గారాలు భారీగా తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదం చేస్తుందని భావిస్తున్నారు. అంతేకాకుండా సంప్రదాయ ఇంధన వనరులపై ఆధారపడే అవసరం గణనీయంగా తగ్గే అవకాశముంది.

అయితే శ్రీవాత్సవ వాదనలను ప్రపంచ శాస్త్ర సమాజం ఇంకా పూర్తిగా అంగీకరించలేదు. గత ప్రయోగాల్లో కొలతలలో లోపాలు ఉండటం వల్లే అదనపు శక్తి విడుదలైనట్లు కనిపించి ఉండవచ్చని అనేక మంది శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ఆయన ప్రతిపాదించిన సిద్ధాంతం ఇప్పటివరకు సమీక్షిత (Peerreviewed) శాస్త్రీయ పత్రికల్లో ప్రచురితం కాలేదు. దీంతో ఇతర నిపుణులు దానిని స్వతంత్రంగా పరిశీలించి ధ్రువీకరించే అవకాశం ఇంకా రాలేదు. తన పరిశోధనకు సంబంధించిన పూర్తి సాంకేతిక వివరాలను ప్రస్తుతం వెల్లడించబోనని శ్రీవాత్సవ స్పష్టం చేశారు. ఈ సాంకేతికతను దుర్వినియోగం చేసి ఆయుధాల అభివృద్ధికి ఉపయోగించే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ముందుగా స్వయంగా మరిన్ని ప్రయోగాలు నిర్వహించి, అవి విజయవంతమైతే అనంతరం పూర్తి వివరాలను ప్రపంచానికి వెల్లడిస్తానని తెలిపారు.

ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో జన్మించిన యోగేంద్ర నారాయణ్ శ్రీవాత్సవ చిన్న వయసులోనే పీహెచ్‌డీ పూర్తి చేసి, అమెరికా, ఇటలీల్లో ప్రొఫెసర్‌గా సేవలందించారు. ఆయన 500కు పైగా పరిశోధనా పత్రాలు ప్రచురించారు. నోబెల్ బహుమతి నామినేషన్ల పరిశీలనకు సంబంధించిన ప్రక్రియలో రాయల్ స్వీడిష్ అకాడమీ మూడుసార్లు ఆయనను భాగస్వామిని చేయడం ఆయనకు ఉన్న శాస్త్రీయ గుర్తింపుకు నిదర్శనంగా చెప్పబడుతోంది.

అయితే శ్రీవాత్సవ చేసిన ఈ ప్రకటనలు ప్రస్తుతం ఆసక్తికరమైన శాస్త్రీయ ప్రతిపాదనలుగానే ఉన్నాయి. ఆయన సిద్ధాంతం నిజమా కాదా అన్నది స్వతంత్ర ప్రయోగాలు, శాస్త్రీయ సమీక్షలు, అంతర్జాతీయ నిపుణుల ధ్రువీకరణ తర్వాతే స్పష్టత రానుంది.





# విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

- ఏఈ కి వినతి పత్రం అందజేసిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు
- సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా ఏఈ రత్నకుమార్

**జూలూరుపాడు, మహా:** మండల పరిధి పడమట నర్సాపురం గ్రామంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీనియర్ కాంగ్రెస్ నాయకులు లేళ్ళ అప్పిరెడ్డి, లేళ్ళ రామిరెడ్డి మండల విద్యుత్ శాఖ అధికారి ఎం రత్న కుమార్ కి సోమవారం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. నర్సాపురం కాలనీ నందు నివాస గృహాల పై ప్రమాదకరంగా ఉన్న 11 కెవి విద్యుత్ లైన్ ను మరలించాలని ఏఈని కోరారు. అదేవిధంగా గ్రామంలోని శివారు ప్రాంతాలలో నూతన నివాస గృహాలు ఏర్పాటైనందున ఆయా ప్రాంతాలలో నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, అవసరమైన ప్రాంతాలలో నూతన సింగిల్ ఫేస్ ట్రాన్స్ఫార్మర్ లు ఏర్పాటు చేయాలని కోరారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని గ్రామంలో ఈ మధ్యకాలంలో చోరీకి గురైన వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ లు సకాలంలో అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. పై విషయాలపై సానుకూలంగా స్పందించిన ఏఈ రత్నకుమార్ మాట్లాడుతూ తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. తమ పరిధిలో పనులను వాయిదా వెయ్యకుండా, పరిష్కరిస్తామని, ఆ పై స్థాయి పనులను ఎప్పటికప్పుడు తమపై అధికారులకు నివేదిస్తామని తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టినందున మండల వ్యాప్తంగా ఉన్న పరిస్థితులను సమీక్షించుకొని, పెండింగ్ లో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.



# విబిఎస్ఏ బిల్లును వ్యతిరేకిస్తూ నిరసన

**ప్రజా ప్రతినిధులంతా వ్యతిరేకించాలి**
**ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వంశీ**

**జూలూరుపాడు, మహా:** వికాస్ భారత్ శిక్షా అధిష్టాన్ (విబిఎస్ఏ) 2025 బిల్లును వ్యతిరేకిస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ లో కళ్ళకు నల్ల రిబ్బను కట్టుకొని, చేతిలో ప్లే కార్డులు పట్టుకొని సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ భద్రాద్రి జిల్లా సహాయ కార్యదర్శి గుగులోతు వంశీ మాట్లాడుతూ ఈ బిల్లు పూర్తిగా రాజ్యాంగ పరిమితులను ఉల్లంఘిస్తూ, సమాఖ్య విధానాన్ని బలహీన పరుస్తుందని, సంస్థగత స్వయం పతిపత్తిని దెబ్బతీస్తుందని అన్నారు. ఉన్నత విద్య ప్రమాణాలను, ప్రజాస్వామ్య సమగ్ర స్వభావాన్ని ముప్పులోకి నెట్టేస్తుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థి సంఘాలను, మేధావులను, ప్రొఫెసర్లను, ఉపాధ్యాయులను ప్రజా స్వామ్యా బద్ధంగా సంప్రదింపులు జరపాలని, రాజ్యాంగ సూత్రాలకు అనుగుణంగా ఉండాలని అన్నారు. బిల్లును పరిశీలించి అందులో లోపాలను, అసమానతలను గుర్తించి అట్టి బిల్లును శీతాకాలం సమావేశాల్లో ప్రజా ప్రతినిధులు అంతా వ్యతిరేకించాలని కోరారు. ఈ బిల్లు విశ్వ విద్యాలయాల్లో మంచి వనరులు ఉన్న సంస్థలకే ప్రయోజనం చేకూర్చుతుందన్నారు. ఈ బిల్లు వెనకబడిన ప్రాంతాలకు, చిన్న కాలేజీలకు ప్రతికూలంగా మారుతుందని వంశీ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు పసుపులేటి పవన్, అనిల్ కుమార్ బాలాజీ, రితికేష్, రామ్ చరణ్, అనిల్ కుమార్, రిషి జస్వంత్, విశాల్ శ్రీరామ్, తేజ తదితరులు పాల్గొన్నారు.



# సర్ ప్రక్రియ మనందరి బాధ్యత

- ప్రతి ఒక్క పౌరుడు ఓటు విలువ తెలుసుకోవాలి
- ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి పిలుపు

**కుషాయిగూడ, మహా :** సర్ ప్రక్రియలో అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు జాబితాలో నుంచి తొలగించకుండా చూడాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి కోరారు. బీఎల్ఓలతో మన పార్టీ బీఎల్ఏలు సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగేలా నాయకులు చూడాలని బండారు లక్ష్మారెడ్డి సూచించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎస్ఐఆర్ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం ఉండొద్దన్నారు. బిఆర్ఎస్ శ్రేణులు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో సర్ పై అవగాహన సమావేశాలు నిర్వహించి, ఓటర్లకు అవసరమైన సహకారం అందించాలన్నారు. సర్ ప్రక్రియను పార్టీ అత్యంత కీలక అంశంగా పరిగణించిందన్నారు. ఈ ప్రక్రియ తుది దశలో ఉందన్నారు. ఇదే అత్యంత కీలకమన్నారు. ఓటర్ల నుంచి ఎన్యూమరేషన్ ఫారాలను తీసుకుని ఆన్ లైన్ చేసేంతవరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# ఆకలితో అల్లాడుతున్నాం...

- నాలుగు నెలల నుండి ఇదే పరిస్థితి
- మాకు బువ్వ పెట్టండి
- సౌకర్యాలు లేక చదువుకి ఆటంకాలు
- భోజనం పెట్టడంతోపాటు సౌకర్యాలు కల్పించాలని విద్యార్థులు ఆందోళన



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ఆకలితో అల్లాడిపోతున్నాం.. గత నాలుగు నెలల నుండి ఇదే పరిస్థితి ఉంది.. మాకు కడుపునిండా బువ్వ పెట్టి ఆకలి తీర్చాలని.. చదువుకునేందుకు సకల సౌకర్యాలు కల్పించాలని వేడుకుంటూ విద్యార్థులు నిరసన బాట పట్టారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పరిధిలోని కలెక్టరేట్ పక్కన ఉన్న డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ హాస్టల్ లో చదువుతున్న వారికి భోజనం పెట్టడం లేదని ఆరోపిస్తూ సోమవారం యూనివర్సిటీ ఆవరణలో విద్యార్థులు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ గత కొద్ది నెలల నుండి తమకు భోజనం పెట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక దిక్కు ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందని చెబుతున్నప్పటికీ ఇక్కడి యూనివర్సిటీలో అందుకు విరుద్ధంగా వాతావరణం కనిపిస్తుందని అసహనం వ్యక్తపరిచారు. భోజనం లేక అల్లాడిపోతున్నామని ఆరోగ్యపరంగా కూడా ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని విద్యార్థులు వివరించారు. చదువుకునేందుకు కంప్యూటర్లు సరిగా పనిచేయడం లేదని తెలిపారు. హాస్టల్లో వసతులు సక్రమంగా లేవని వివరించారు. రాత్రి సమయంలో ఆరోగ్యపరంగా ఇబ్బంది పడితే తమకు వైద్య సేవలు కూడా అందే పరిస్థితి లేదని విచారం వ్యక్తం చేశారు. చుట్టూ చెట్లు ఉండడం మూలంగా రాత్రి సమయంలో యూనివర్సిటీ ఆవరణలో విష సర్పాలు సంచరిస్తున్నాయని వీటివల్ల తమకు పెద్ద ప్రమాదం పొంచి ఉందన్నారు. హాస్టల్ కు సంబంధించిన మరుగుదొడ్లు కూడా సరిగ్గా లేవన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించి డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీలో ఉంటున్న హాస్టల్ విద్యార్థులకు ప్రతిరోజు రుచికరమైన భోజనంతోపాటు వ్యాధుల సీజన్ దృశ్య వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. హాస్టల్ భవనంలోని మరుగుదొడ్లను బాగు చేయడంతో పాటు కనీస సౌకర్యాలు కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు.



# రాష్ట్ర వైస్ ఛైర్మన్ వెంకటేశ్వర్లును అభినందించిన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి..

- భవిష్యత్ లో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్ష..

**తల్లాడ, జులై, 20, (మహా ):** టీపీసీసీ ఎస్సీ డిపార్ట్ మెంట్ రాష్ట్ర వైస్ ఛైర్మన్ గా నారపోగు వెంకటేశ్వర్లు నియామకం కావడం పట్ల రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అభినందించారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఆయన మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైస్ ఛైర్మన్ పదవి వచ్చిన సందర్భంగా మంత్రి ఆయనను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో పదవికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని, భవిష్యత్తులో ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం ఇరువురు కొద్దిసేపు ఆప్యాయంగా పలకరించుకొని పలు విషయాలు మాట్లాడుకున్నారు. మంత్రి పొంగులేటికి వెంకటేశ్వర్లు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# గిరిజన మహిళలపై దురుసుగా ప్రవర్తించిన ఫారెస్ట్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి..

- బాధ్యుల సస్పెన్షన్‌కు రేణుక అక్షర మహిళా మండలి డిమాండ్..
- స్పందించకపోతే ఫారెస్ట్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరిక

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మనబోతులగూడెం-వేమలూరు గ్రామాల మధ్య పోడు భూముల్లో చోటు చేసుకున్న ఘటనలపై రేణుక అక్షర మహిళా మండలి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సోమవారం అక్షర మాల మండలి సభ్యులు విలేకరులతో మాట్లాడారు. పోడు భూముల్లో పత్తి విత్తనాలు వేస్తున్న గిరిజన రైతులను అటవీ శాఖ సిబ్బంది అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయని, ఈ సందర్భంగా మహిళలతో తోపులాట జరగడం, మహిళలు నేలపై పడిపోయినట్లు కనిపించే వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడం ఆందోళనకరమని మండలి పేర్కొంది. గిరిజనుల జీవనాధారమైన పోడు భూముల్లో వ్యవసాయం చేస్తున్న మహిళలతో దురుసుగా ప్రవర్తించడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. గిరిజన మహిళలపై బలప్రయోగానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అటవీ శాఖ అధికారులపై వెంటనే సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులను సస్పెండ్ చేసి కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి అధికారికంగా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. గిరిజన మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను ఏ పరిస్థితుల్లోనూ సహించబోమని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే పెద్దఎత్తున ప్రజా ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఫారెస్ట్ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళనను ఉద్ధృతం చేస్తామని రేణుక అక్షర మహిళా మండలి స్పష్టం చేసింది. గిరిజన మహిళల హక్కులు, ఆత్మగౌరవ పరిరక్షణ కోసం ప్రతి గిరిజన మహిళ ఏకమై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో రేణుక అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూనం సరోజ, సభ్యులు ఎండి షబానా, కోరి శ్యామల, కన్నాపురం వసంత, రెడ్డిబోయిన రేణుక, దేరంగుల సుజాత, కన్నాపురం శైలజ, బాడిష పార్వతి తదితరులు పాల్గొన్నారు.



# నిరుద్యోగులకు సింగరేణి ఉచిత నైపుణ్య శిక్షణ..

- ఈ నెల 30లోపు దరఖాస్తులు..
- ఏజీఎం (పర్సనల్) ఎస్. రమేష్

**మణుగూరు, మహా :** నిరుద్యోగ యువతీ యువకులు, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మణుగూరు ఏరియా పీవీ కాలనీలో వివిధ వృత్తి నైపుణ్య tకోర్సుల్లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు ఏజీఎం (పర్సనల్) ఎస్. రమేష్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలని ఆయన సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రస్తుతం మార్కెట్లో అధిక డిమాండ్ ఉన్న టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, కంప్యూటర్ డీటీపీ, మగ్గం వర్క్స్, క్లాత్, జ్యూట్, బంజారా బ్యాగుల తయారీ, ఫోటోషాప్, మల్టీమీడియా కోర్సుల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకుల ద్వారా ఉచిత శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు. శిక్షణ పూర్తిచేసి పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఖాదీ గ్రామోద్యోగ్ మహా విద్యాలయ, హైదరాబాద్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. గతంలో సింగరేణి సేవా సమితి ద్వారా శిక్షణ పొందిన అనేక మంది స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించి, తాము ఉపాధి పొందడమే కాకుండా మరికొందరికి కూడా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. సింగరేణి ఉద్యోగుల కుటుంబ సభ్యులు, మాజీ ఉద్యోగుల కుటుంబ సభ్యులు, నిరుద్యోగ మహిళలు, యువతులు, యువకులు, అలాగే మణుగూరు మరియు పరిసర ప్రాంతాలకు చెందిన ఆసక్తి గల అభ్యర్థులు తమ పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తుకు ఒక పాస్‌పోర్ట్ సైజు ఫోటో జతచేసి మణుగూరు ఏరియా జీఎం కార్యాలయం పర్సనల్ విభాగంలో ఈ నెల 30వ తేదీలోపు అందజేయాలని ఏజీఎం (పర్సనల్) ఎస్. రమేష్ సూచించారు. ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలను పెంపొందించుకొని స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.



# తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి

**ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**కుషాయిగూడ, మహా :** నియోజకవర్గంలో తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యుద్ధ ప్రతిపాదికన చర్యలు నిర్వహించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి వాటర్ బోర్డు అధికారులకు సూచించారు. వర్షాలు పడకపోవడంతో ఆయా కాలనీలలో త్రాగునీరు కోసం ముందస్తుగా చర్యలు చేపట్టాలన్నారు. సోమవారం హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ పంకజ ను బగాయత్ లోని కార్యాలయంలో కలిశారు. నియోజకవర్గంలో అత్యవసరంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే ఆమోదించి, ప్రాధాన్యత ప్రాతిపదికన నిధులు మంజూరు చేయాలని బండారు లక్ష్మారెడ్డి వాటర్ బోర్డు అధికారులను కోరారు.



# బిజెపి ఆధ్వర్యంలో శక్తి కేంద్రాలు ఏర్పాటు

- 56వ డివిజన్ శక్తి కేంద్రం ఇన్చార్జిగా బిజెపి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు గాయత్రి

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "సర్" ఎన్నికల ప్రక్రియను అర్థమయ్యే విధంగా చెప్పేందుకు వీలుగా బిజెపి ఆధ్వర్యంలో శక్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. సోమవారం బిజెపి అనుబంధ మహిళా మోర్చా అధ్యక్షురాలు సముద్రాల గాయత్రి కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 56వ డివిజన్ లో శక్తి కేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ శక్తి కేంద్రానికి ఇన్చార్జిగా ఉన్న జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు గాయత్రి మాట్లాడుతూ బిజెపి జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. అయితేకేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారుల సమక్షంలో జిల్లా అధికారులు నిర్వహిస్తున్న" సర్" సహాయ కేంద్రం ద్వారా సామాన్య ఓటర్లను సైతం కాపాడుకునే విధానంపై చైతన్యం చేయనున్నట్లు తెలిపారు.56వ డివిజన్ పరిధిలో గల అజ్మత్ కిరాణా షాపు వద్ద 139, 140, 141, 142 బూత్ ఓటర్లకు "సర్" సహాయ కేంద్రం, ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ప్రతి ఒక్క ఓటర్ ఇప్పటి వరకు ఇంకా ఓటరు నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోని వారు ఈ సహాయ కేంద్రాల వద్దకు వచ్చి బిఎల్వో లు తమకు ఇచ్చిన ఫారాలను పూర్తి చేసుకుని తప్పకుండా తమ వివరాలని సంబంధింత బిఎల్ఓ అధికారులకు ఇచ్చి తమ ఓటు హక్కు పత్రాలను బి ఎల్ ఓ లకి అంద చేయవలసిందిగా కోరడం జరిగింది. ప్రతి ఓటరుకు అవగాహన కల్పిస్తూ వారికి సహాయ సహకారాలు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి జాటోత్ వెంకన్న నాయక్, బిజెపి ఆఫీస్ సెక్రెటరీ దురిశెట్టి కుమార్, బి.ఎల్.ఓ.2 పిల్లి వేణు వాసవరావు, బి ఎల్ ఓ శైలజ, గౌసియా, జ్యోతి, అలాగే స్థానిక ఓటర్లు గౌస్, హమీద బేగం, వినయ్ కుమార్, సుప్రజ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

# నైషా విజ్ఞాన ప్రతిభ తెలంగాణకే గర్వకారణం


- అభ్యుదయ కళా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్
- ర్యాంకు సాధించిన నైషాకు ఘన సన్మానం



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** నైషా విజ్ఞాన ప్రతిభ తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణం అని అభ్యుదయ కళా సేవా సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ పేర్కొన్నారు. ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ కు స్టూడెంట్ అయిన మెడికేర్ డయాగ్నస్టిక్స్ అధినేత డాక్టర్ ప్రవీణ్ కుమార్తె నైషా "నీట్ "పరీక్షలో ఆల్ ఇండియా ర్యాంక్ సాధించడం పట్ల పలువురు అభినందించారు. ఈ సందర్భంగా స్థానిక గణేష్ టెంపుల్ వద్ద గల మెడికేర్ డయాగ్నొస్టిక్ సెంటర్లో సోమవారం నైషా తల్లిదండ్రులు మిత్రులు శ్రేయోభిలాషులు మెడికేర్ సిబ్బంది సమక్షంలో నైషాకు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ పూల బొకేను అందించి శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో ఘనంగా సత్కరించడం జరిగింది. అనంతరం మద్దెల శివకుమార్ మాట్లాడుతూ ర్యాంకు సాధించిన నైషా భవిష్యత్తులో ఇంకా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి మన కొత్తగూడెం కీర్తి ప్రతిష్టలను దేశవ్యాప్తంగా ఇనుమడింప చేయాలని ఆశీర్వదించారు. అనంతరం ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ ను డాక్టర్ ప్రవీణ్ దంపతులు శాలువాతో సత్కరించి ఘనంగా అభినందించారు. ఈ ఆత్మీయ అభినందన కార్యక్రమంలో ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ శిరీష, సన్మాన గ్రహీత కుమారి నైషాలతో పాటు అభ్యుదయ కళాసేవ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అపరబాలు అల్లి శంకర్, సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండా రమేష్, మరొక రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.సురేందర్, రాష్ట్ర మైనార్టీ నాయకులు సల్మాన్ ఖాన్ తోత, గోపీ, మెడికేర్ సిబ్బంది డాక్టర్ కవిత, రామ్ చందర్, లోకేష్, సంతోష్, రజని తదితరులు పాల్గొన్నారు.

# పాత కొత్తగూడెం ఆరోగ్య కేంద్రాన్ని బాగు చేయండి


- అదనంగా సిబ్బందిని నియమించాలి
- ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలి
- స్టేషనరీ కొనుగోలుకు నిధులు ఇవ్వాలి
- భవనం లీకేజీలను సరి చేయాలి
- ప్రజావాణిలో పివైఎల్ పిఓడబ్ల్యు సంఘాల వినతి



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్పొరేషన్ పరిధిలో ఉన్న పాత కొత్తగూడెం ఏరియాలో గతంలో ఏర్పాటు చేసిన వైద్యశాలకు ప్రస్తుతం సమస్యల తాకిడి ఎక్కువగా ఉందని ప్రధానమైన సమస్యలను వెంటనే పరిష్కరించడంతోపాటు అదనంగా సిబ్బందిని నియమించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో పివైఎల్ పిఓడబ్ల్యు సంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘాల నాయకులు మాట్లాడుతూ పాత కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి కావలసిన సౌకర్యాలతో పాటుగా సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రి ప్రహరీ గోడ కూలిపోయి దాదాపు రెండు సంవత్సరాలు కావస్తున్న ఇంతవరకు ఆ గోడకు మరమ్మత్తులు చేయలేదన్నారు. గోడ కూలి ఉండడంవల్ల ఆసుపత్రి లోపలికి పశువులు వచ్చి అపరిశుభ్రంగా తయారు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నాటిన మొక్కలను సైతం పశువుల ధ్వంసం చేయడం జరిగిందన్నారు. వర్షాకాలం కావడంతో వైద్యశాల భవనం కురుస్తుందని కారణంగా మందులు నిల్వచేసే గది అపరిశుభ్రంగా మారిందన్నారు. మందులను నిలువచేసే గదిని రిపేర్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. భవనానికి సైతం రంగులు వేయాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రికి అవసరమయ్యే స్టేషనరీని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ ను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. వైద్యశాల ఓకే వైద్యుడుతో నడుస్తుందని మరో వైద్యుని నియమించాల్సిన అవసరం ఉందన్నారు. అంతేకాకుండా ఒక స్టాఫ్ నర్స్ తో పాటు వాచ్మెన్ ఆయాను సైతం ఏర్పాటు చేయాలన్నారు. కరోనా కాలంలో ఎంతోమందికి పాత కొత్తగూడెం ఆసుపత్రి వైద్య సేవలు అందించిందని అలాంటి ఆసుపత్రిని నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే సదుపాయాలను కల్పించడంతోపాటు సిబ్బందిని నియమించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పివైఎల్ పట్టణ అధ్యక్షుడు లిక్కి నరేష్, పిఓడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు పెద్ద గ్రోని ఆదిలక్ష్మి, నాయకులు ఎం.వంశీ, జీవన్, సాగర్, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# లైంగిక వేధింపుల ఆరోపణలు

- ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నం
- ఆస్పత్రిలో చేర్చిన బంధువులు



**హైదరాబాద్, మహా :** నేషనల్ పోలీస్ అకాడమీ (ఎన్‌పీఏ) లో లైంగిక వేధింపుల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. తోటి మహిళా అధికారిణిపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నం చేయడం తీవ్ర కలకలం రేపింది. సోమవారం ఉదయం మోతీనగర్‌లోని తన బంధువుల ఇంట్లో ఆయన శానిటైజర్ తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. ఇది గమనించిన బంధువులు వెంటనే ఆయనను ఎస్ఆర్ నగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం ఆయన ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. తనపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని ఆత్మహత్యాయత్నానికి ముందు ఉదయ్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పోస్ట్ చేసినట్లు సమాచారం.రాజేంద్రనగర్‌లోని ప్రతిష్టాత్మక సర్దార్ వల్లభభాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న కర్ణాటకకు చెందిన మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణి ఉదయ్ కృష్ణారెడ్డి తనను శారీరకంగా, లైంగికంగా వేధిస్తున్నాడంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. నిందితుడు జూన్ 23 నుంచి తనకు అసభ్యకర మెసేజ్‌లు పంపాడని పేర్కొన్నారు. ఆపై జూలై 8న గదిలోకి లాకెళ్లి ఫోన్ పాస్‌వర్డ్ చెప్పాలని బెదిరించాడని.. జూలై 9న గదిలో బంధించి, జుట్టు పట్టుకుని దాడి చేసి, మెడపై కత్తి పెట్టి బెదిరించాడని ఆరోపించారు. జూలై 10న తన ప్రైవేట్ వీడియోలు తీసి, వాటిని తన భర్తకు పంపిస్తానంటూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడినట్లు బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అత్తాపూర్ పోలీసులు శనివారం ఉదయ్ కృష్ణారెడ్డిపై భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్లు 74, 75, 77, 315(2)తో పాటు ఐటీ చట్టం కింద కఠినమైన కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు గతంలోనూ సహచర ఐపీఎస్‌లతో అమర్యాదగా ప్రవర్తించేవాడని, వాట్సప్ గ్రూపుల ద్వారా కొందరిని వేధించినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.

**సస్పెన్షన్ వేటు వేసిన పోలీస్ అకాడమీ**

ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణా రెడ్డిని నేషనల్ పోలీస్ అకాడమీ అధికారులు తాత్కాలికంగా సస్పెండ్ చేసి అకాడమీ నుండి పంపించివేశారు. తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా రంగంలోకి దిగిన ప్రివిలేజ్ కమిటీ.. సీసీటీవీ దృశ్యాలు, ఇతర కీలక ఆధారాలను సేకరించి విచారించిన అనంతరం ఆయనపై వచ్చిన ఆరోపణలు నిజమేనని నిర్ధారించి ఈ తక్షణ సస్పెన్షన్ నిర్ణయం తీసుకుంది. అయితే, భవిష్యత్తులో ఆయన సర్వీసులో చేరడానికి సంబంధించిన తుది నిర్ణయం మాత్రం కేంద్ర సిబ్బంది, శిక్షణా వ్యవహారాల శాఖ పరిధిలోనే ఉంటుందని ఎన్ పీఏ అధికారులు స్పష్టం చేశారు.

ఎంతో మందికి స్ఫూర్తి దాయకంగా నిలిచి...

**నిన్నటివరకూ ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలిచిన ఉదయ్ కృష్ణారెడ్డి**

ఏపీలోని ప్రకాశం జిల్లా ఊళ్లపాలెంకు చెందిన ఉదయ్ కృష్ణారెడ్డి జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచింది. తల్లిదండ్రులు లేకపోవడంతో నానమ్మ వద్ద పెరిగాడు. కూరగాయలు అమ్ముతూ ఆమెకు చేదోడు వాదోడుగా ఉంటూ ప్రభుత్వ పాఠశాలలో చదివారు. ఈ క్రమంలో ఉమ్మడి ఏపీలో చివరి నోటిఫికేషన్ 2013లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. కొన్నేళ్లపాటు కానిస్టేబుల్ గా సేవలు అందించారు. ఈ క్రమంలో ఉన్నత అధికారి చేసిన అవమానంతో ఉద్యోగానికి రాజీనామా చేసి సివిల్స్ ప్రిపరేషన్ మీద ఫోకస్ చేశారు. నాలుగు పర్యాయాలు ఫెయిల్ అయినా కుంగిపోలేదు. కచ్చితంగా విజయం సాధిస్తానని నమ్మిన ఆయన ఐదో ప్రయత్నంలో 360వ ర్యాంకుతో సివిల్స్ సాధించారు. కానిస్టేబుల్ స్థాయి నుంచి ఐపీఎస్ అధికారిగా ఎదిగి తెలుగు రాష్ట్రాల వారితో పాటు దేశంలోని చాలా మంది యువతగా ఆదర్శంగా నిలిచారు. ప్రస్తుతం శివరాంపల్లిలోని నేషనల్ పోలీస్ అకాడమీలో ట్రైనీ ఐపీఎస్‌గా శిక్షణ పొందుతున్నారు. త్వరలో బాధ్యతలు స్వీకరించాల్సి ఉన్న ఈ సమయంలో పోలీస్ అకాడమీలో తోటి ట్రైనీ మహిళా ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# శంషాబాద్‌లో రూ.12 కోట్ల బ్యాంకు కుంభకోణం కలకలం



**రంగారెడ్డి, మహా :** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని చిన్న గోల్కొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) బ్యాంకులో భారీ ఆర్థిక అక్రమాలు వెలుగులోకి రావడంతో కలకలం రేగింది. 2008 నుంచి 2011 మధ్యకాలంలో డిపాజిటర్లకు చెందిన సుమారు రూ.12 కోట్ల నిధులు అక్రమంగా మళ్లించారనే ఆరోపణలు రావడంతో బాధితులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. బ్యాంకు ముందు చేరిన డిపాజిటర్లు నినాదాలు చేస్తూ తమ సొమ్మును వెంటనే తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు.

బ్యాంకు మాజీ సీఈవో బల్లమోని యాదయ్య, క్లర్క్ సురేందర్ యాదవ్ కుమ్మక్కై డిపాజిటర్ల డబ్బును అక్రమంగా దారి మళ్లించారని బాధితులు ఆరోపించారు. దీర్ఘకాలంగా కష్టపడి కూడబెట్టిన పొదుపు మొత్తాలు బ్యాంకులో భద్రంగా ఉంటాయని నమ్మి డిపాజిట్ చేసిన తమకు ఇప్పుడు తీవ్ర అన్యాయం జరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమాల విషయం వెలుగులోకి రావడంతో డిపాజిటర్లు ఒక్కసారిగా బ్యాంకు వద్దకు చేరుకుని నిరసన చేపట్టారు.

ఆందోళన ఉద్ధృతంగా మారడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బ్యాంకు పరిసరాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. డిపాజిటర్లు మాత్రం బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకుని తమ డబ్బు తిరిగి చెల్లించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ఈ బ్యాంకుపై దాదాపు పది గ్రామాల రైతులు, చిరు వ్యాపారులు, సాధారణ ప్రజలు ఆధారపడుతున్నారని బాధితులు తెలిపారు. రెండు, మూడు దశాబ్దాలుగా తమ పొదుపు మొత్తాలను ఈ సహకార బ్యాంకులోనే భద్రపరుస్తూ వచ్చామని, ఇప్పుడు కోట్ల రూపాయల కుంభకోణం వెలుగులోకి రావడంతో కుటుంబాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టార్జితాన్ని కాజేసిన వారిని వెంటనే అరెస్టు చేసి, అక్రమంగా మళ్లించిన నిధులను రికవరీ చేసి డిపాజిటర్లకు తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు.

బ్యాంకు నూతన సీఈవో యాదగిరి రెడ్డి ఈ వ్యవహారంపై స్పందిస్తూ, డిపాజిట్లకు సంబంధించిన అక్రమాలు జరిగినట్లు గుర్తించిన వెంటనే జిల్లా సహకార అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లా సహకార శాఖ అధికారులు పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టారని, విచారణ నివేదిక వచ్చిన వెంటనే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన అన్ని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని, డిపాజిటర్లకు ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటామని యాదగిరి రెడ్డి హామీ ఇచ్చారు. దర్యాప్తు పూర్తయ్యే వరకు ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, బ్యాంకు కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు.ఇప్పటికే ఈ వ్యవహారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు బ్యాంకు యాజమాన్యం వెల్లడించింది. జిల్లా సహకార శాఖ చేపట్టిన దర్యాప్తులో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని అధికారులు స్పష్టం చేస్తున్నారు. మరోవైపు, తమ కష్టార్జితాన్ని కాపాడాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుని నష్టపోయిన ప్రతి డిపాజిటర్‌కు న్యాయం చేయాలని బాధితులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



# సహకార సంఘంలో 12 కోట్ల గోల్ మాల్

- 300 మంది రైతుల డిపాజిట్లు మాయం...
- లనాలుగు నెలలుగా బ్యాంకు చుట్టూ తిరుగుతున్న రైతులు..
- గేటుకు తాళంవేసి ఆందోళనలు...

**రాజేంద్రనగర్ మహా;** 300 మంది రైతుల ఫిక్స్ డిపాజిట్లు గల్లంత కావడంతో, మీడియాను డిపాజిట్ దారులు సంప్రదించకుండా ప్రతినెల అంతో ఇంతో డబ్బులు చెల్లిస్తూ సొసైటీ పెద్దలు రైతులతో ఒప్పందం కుదిరించుకున్నారు. ఈ తతంగం గత నాలుగు నెలల నుంచి సాగుతుంది, రైతులు తమ కష్టార్జితాన్ని దాచుకున్న డబ్బును, కూతురు కొడుకు పెళ్లిల కోసం భూముల అమ్ముకొని సొసైటీ బ్యాంకులలో డిపాజిట్ చేశారు. ఎంతో కొంత బ్యాంకు ఇంట్రెస్ట్ వస్తోందని అవసరాల నిమిత్తం శంషాబాద్ చిన్న గోల్కొండ ప్యాక్స్ సొసైటీ బ్యాంకులలో ఫిక్స్ డిపాజిట్ చేశారు. సంవత్సరాల తరబడి ఫిక్స్ డిపాజిట్ లకు ఇంట్రెస్ట్ చెల్లిస్తూ కాలంవెళ్లదీశారు. సొసైటీ పాలకవర్గం సోమవారం కొంత డబ్బు డిపాజిట్ దారులకు చెల్లిస్తామని చెప్పడంతో చిన్న గోల్కొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి రైతులు భారీగా తరలి వచ్చారు. దీంతో రావాల్సిన డబ్బులు రాకపోవడంతో సిబ్బందిని గేటు బయటే ఉంచి డిపాజిట్ దారులు( రైతులు ) సొసైటీ గేటుకు తాళం వేసి సోమవారం ఆందోళనలు చేపట్టారు. శంషాబాద్ పోలీసులకు సమాచారం అచేశారు. సంఘటనా స్థలానికి చేరుకోని డిపాజిట్ దారులను సముదాయించి సొసైటీ ససిబ్బందిని లోపలికి పంపించారు. రెండు నెలవుతున్న జిల్లా సహకార సంఘం అధికారులు చిన్న గోల్కొండ సొసైటీలో 12 కోట్ల గోల్మాల్పై తొందరగా విచారణ జరిపించి దోషులను తేల్చాలన్నారు. నెలలు గడుస్తున్న ఒక వ్యక్తి వచ్చి రికార్డును పరిశీలిస్తున్నారు. ఇంకెన్ని రోజులు ఈ రికార్డులను పరిశీలిస్తూ ఉంటారని రైతులు అధికారులను ప్రశ్నించారు. కొందరు రైతులు కోట్లల్లో డిపాజిట్లు చేశారు. వారు చేసినట్టు ఆన్లైన్లో లేకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. గత 20 సంవత్సరాల నుంచి యాదయ్య అనే వ్యక్తి చిన్న గోల్కొండ సొసైటీలో సీఈఓ పనిచేస్తూ రిటైర్ అయ్యారు. రిటైర్ అయిన సొసైటీలోనే ఎందుకు కొనసాగుతున్నారని రైతులు ప్రశ్నించారు. 12 కోట్ల ఎవరు గోల్మాల్ చేశారు. విచారణ త్వరగా చేసి నిందితులనుంచి డబ్బులు రికవరీ చేసి డిపాజిట్ దారులకు చెల్లించాలన్నారు. సొసైటీ ఏర్పడినప్పటి నుంచి రికార్డులను పరిశీలించి 12 కోట్ల గోల్మాల్ కి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని రైతులు డిమాండ్ చేశారు.

# అనుమతులు లేని పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్.!

- ప్రైవేట్ కార్పొరేట్ స్కూళ్లలో యూనిఫాం పుస్తకాల దందాను అరికట్టాలి
- తెలంగాణ రాజ్యాధికార పార్టీ యువజన నేత ముత్యాల మనీష్ పటేల్

ఇబ్రహీంపట్నం ఎంఈవోకు వినతిపత్రం అందజేత



**ఇబ్రహీంపట్నం జూలై 20 మహా:** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, తెలంగాణ రాజ్యాధికార పార్టీ యువజన నేత ముత్యాల మనీష్ పటేల్ అన్నారు. ఇబ్రహీంపట్నంలో అనుమతులు లేని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని, పాఠశాలల్లో యూనిఫాంలు, పుస్తకాల పేరుతో జరుగుతున్న అక్రమ దందాను అరికట్టాలని, మండల విద్యాశాఖ అధికారి హిర్యా నాయక్ ను కలిసిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ యువజన అధ్యక్షుడు ముత్యాల మనీష్ పటేల్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండల పరిధిలో అనుమతులు లేకుండా నడుస్తున్న కొన్ని ప్రైవేట్ పాఠశాలల వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న విద్యా సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.అదేవిధంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపే విధంగా ఒకే దుకాణాల్లో యూనిఫాంలు, పుస్తకాలు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నాయని ఆరోపించారు. ఇటువంటి అక్రమాలను అరికట్టి, విద్యా వ్యవస్థలో పారదర్శకత తీసుకురావాలని ఎంఈవోను కోరారు. విద్యార్థుల హక్కులను పరిరక్షించడంతో పాటు తల్లిదండ్రులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకుంటామని ఎంఈవో హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు, యువజన విభాగం ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బస్తీ దవాఖానల కోసం

**ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే**

**కుషాయిగూడ, మహా :** నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలంగాణ ఆరోగ్య & కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ సంగీత సత్యనారాయణ ను సోమవారం కలిసి నియోజకవర్గంలో కొత్త బస్తీ దవాఖానలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో వేగంగా పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రాథమిక ఆరోగ్య సేవలను మరింత విస్తరించాల్సిన అవసరాన్ని ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి సంగీత సత్యనారాయణకు వివరించారు. ప్రజలకు వారి నివాస ప్రాంతాలకు సమీపంలోనే నాణ్యమైన వైద్య సేవలు, ఉచిత మందులు, అవసరమైన వైద్య పరీక్షలు అందుబాటులో ఉండేలా అదనపు బస్తీ దవాఖానలను ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే విన్నవించడంతో ఆరోగ్య శాఖ డైరెక్టర్ సానుకూలంగా స్పందించి, ప్రతిపాదనను పరిశీలించి ప్రభుత్వానికి నివేదించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వ దావకానాల లో మందుల కొరత లేకుండా చూడాలని ఎమ్మెల్యే కోరారు.




## బహదూర్ గూడ రైతుల భూములకు
# బలవంతంగా కంచెలు వేశారు

- రాష్ట్ర ప్రభుత్వం రైతులకు జీవనాధారం చూపించారా..
- డివిజన్ అధ్యక్షులు కోలాన్ ప్రదీప్ రెడ్డి..

రాజేంద్రనగర్ మహా ; బహదూర్ గూడ రైతుల భూములకు రాష్ట్ర ప్రభుత్వం భారీ పోలీసు బందోబస్తు మధ్య భయాందోళనకు గురి చేసి కంచెలు వేశారు. ఇప్పుడు వీరి జీవనాధారం వ్యవసాయం వేరే పని తెలియదు. రైతులు కుటుంబలను ఎలా పోషించాలని బిఆర్ఎస్ పార్టీ శంషాబాద్ డివిజన్ అధ్యక్షులు కోలాన్ ప్రదీప్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బిఆర్ఎస్ నాయకులు కోలాన్ ప్రదీప్ రెడ్డిసోమవారంబహదూర్ గూడలోని లక్ష్మీ తాండ రైతులను పరామర్శించారు. శంషాబాద్ లో ప్రతి ప్రాజెక్టుకు బహదూర్ గూడ రైతులు సహకరించారు. రైతులను కావాలని భయభ్రాంతులకు గురిచేసి భూములు లాక్కోవాలని ప్రయత్నం చేశారు. అందులో భాగంగానే తాతల తండ్రుల కాలం నుంచి వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నాం. భయాందోళనలో అనుకోకుండా ఈ దాడులు జరిగాయి. అంతే తప్ప కావాలని చేసింది లేదని రైతులు వాపోయారు. ఇప్పటికైనా తమకు సరైన న్యాయం జరిపించాలని బిఆర్ఎస్ నాయకులను వేడుకున్నారు.

## తొలగించినచోటే బిగించిన విద్యుత్ మీటర్...

- అత్యుత్సాహమే తప్ప ఆరోపణలలో వాస్తవం లేదు....
- వాసవం తెలుసుకున్న అధికారులు మీటర్ బిగింపు
- జర్నలిస్టుల వృత్తికి మచ్చ తెచ్చేలా వ్యవహరించవద్దు..



**ఇబ్రహీంపట్నం జూలై 20 మహా:** ఆదిభట్ల సర్కిల్ బొంగులూరు గ్రామం ఇందిరమ్మ కాలనీలో ఓ పత్రికలో వచ్చిన విద్యుత్ మీటర్ తొలగింపు అనే కథనంలో వాస్తవం లేదు. తన పరిధి కాకున్నా అసత్య ఆరోపణలు చేస్తూ అత్యుత్సాహంతో ఈ యొక్క వార్తను రాయడం జరిగింది. సోమవారం విద్యుత్ అధికారుల ఆదేశాల మేరకు తొలగించిన చోటే విద్యుత్ మీటర్ను బిగించడం జరిగింది. ఒక విలేఖరి పై అసత్య ఆరోపణలు చేస్తూ వచ్చిన కథనంలో వాస్తవం లేదని తేలిపోయింది. అత్యుత్సాహంతో వార్త కథనాన్ని ప్రచురించడం జరిగిందని బాధితులు అన్నారు.... తమపై తప్పుడు అభియోగం మోపి, ఒక పత్రిక పేరును ఉచ్చరిస్తూ, వాస్తవం లేని వార్త రాయడం తన విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు. ఇకముందైన వాస్తవాలు తెలుసుకొని వార్తలు రాయాలని, అవివేకంతో వార్తలు రాసి జర్నలిస్టుల వృత్తికి మచ్చ తేవద్దని సూచించడం జరిగింది.



# ఉప్పల్ కాలభైరవ స్వామి దేవాలయంలో వారాహి పూజ

**పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

కుషాయిగూడ, మహా : ప్రసిద్ధ శ్రీ కాలభైరవ స్వామి దేవాలయంలో నిర్వహించిన పవిత్ర శ్రీ వారాహి అమ్మ వారి ప్రత్యేక పూజా కార్యక్రమం, అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో ఉండాలని, తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని భగవంతుడిని వేడుకున్నారు. సకాలంలో వర్షాలు పడాలని పాడిపంటలతో తెలంగాణ కళకళలాడాలని భగవంతుడిని ప్రార్థించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు గుండ మల్లయ్య, ఆలయ కమిటీ సభ్యులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# సభ్యులంతా సానుకూల దృక్పథంతో వ్యవహరించాలి

( మొదటి పేజీ తరువాయి )



గర్వకారణమని ప్రధాని పేర్కొన్నారు. ఆ సంస్థలో పనిచేస్తున్న యువ ఇంజినీర్ల సగటు వయస్సు కేవలం 28 సంవత్సరాలేనని చెబుతూ, "నేను మాట్లాడేది 28 ఏళ్ల యువత గురించి.. 56 ఏళ్ల యువకుడి గురించి కాదు" అని వ్యాఖ్యానించారు. ప్రధాని చేసిన ఈ వ్యాఖ్యలు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ఉద్దేశించినవేనని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. గత ఏడాది వర్షాకాల సమావేశాలకు ముందు భారతీయ వ్యోమగామి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్న విషయాన్ని గుర్తు చేసిన మోదీ, ఇప్పుడు భారత యువత రూపొందించిన ప్రైవేట్ రాకెట్ విజయవంతంగా ప్రయోగం కావడం దేశ సాంకేతిక సామర్థ్యానికి నిదర్శనమని కొనియాడారు. ప్రపంచంలో చాలా కొద్ది దేశాలకే ఇలాంటి సామర్థ్యం ఉందని, భారత యువత ఆ జాబితాలో దేశాన్ని నిలబెట్టిందని అన్నారు.

ప్రస్తుత వర్షాకాలం వ్యవసాయ రంగానికి ఎంత కీలకమో, పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు దేశ ప్రజాస్వామ్యానికి అంతే ముఖ్యమని ప్రధాని పేర్కొన్నారు. మంచి వర్షాలు ఎలా ప్రజలకు మేలు చేస్తాయో, ఉత్పాదకంగా జరిగే పార్లమెంట్ సమావేశాలు కూడా దేశాభివృద్ధికి దోహదపడతాయని చెప్పారు. ఉభయ సభల్లో ప్రజా సమస్యలపై సార్థకమైన చర్చలు జరిగి, దేశ ప్రయోజనాలకు అనుకూలమైన నిర్ణయాలు వెలువడాలని ఆకాంక్షించారు. ఇదిలా ఉండగా, వర్షాకాల సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రతిపక్షాలు ఇప్పటికే వ్యూహాన్ని సిద్ధం చేశాయి. అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలు, నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీకేజీ, విద్యార్థుల ఆందోళనలు, నిరుద్యోగం, ప్రజా సమస్యలు వంటి అంశాలపై చర్చకు పట్టుబట్టనున్నాయి. నీట్ పేపర్ లీక్ అంశంపై చర్చించేందుకు ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ రూల్-267 కింద బిజినెస్ సస్పెన్షన్ నోటీసు ఇవ్వగా, కాంగ్రెస్ ఎంపీ రణదీప్ సింగ్ సుర్జేవాలా కూడా లోక్‌సభలో అడ్జర్న్‌మెంట్ మోషన్ నోటీసు సమర్పించారు. దీంతో అధికార, ప్రతిపక్షాల మధ్య తొలి రోజు నుంచే వాగ్వాదం కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఆగస్టు 13 వరకు కొనసాగనున్న ఈ సమావేశాల్లో పలు కీలక బిల్లులను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. లోక్‌సభలో కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ సుప్రీంకోర్టు (సవరణ) బిల్లు-2026ను ప్రవేశపెట్టనున్నారు. ఈ బిల్లుతో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను ప్రస్తుతం ఉన్న 33 నుంచి 37కు పెంచే ప్రతిపాదనకు చట్టబద్ధత కల్పించనున్నారు. దీనితో పాటు ప్రశ్నోత్తరాల సమయం, సంతాప తీర్మానాలు, మంత్రుల ప్రకటనలు, వివిధ శాఖల నివేదికలను సభ ముందు ఉంచనున్నారు. రాజ్యసభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేషనల్ హానర్ (సవరణ) బిల్లు-2026ను ప్రవేశపెట్టనున్నారు. జాతీయ గీతం వందేమాతరంకు అవమానం కలిగించడం లేదా ఆలపించకుండా అడ్డుకోవడాన్ని శిక్షార్హమైన నేరంగా ప్రకటించేలా ఈ బిల్లులో నిబంధనలు ప్రతిపాదించారు. అలాగే గత సమావేశాల అనంతరం తీసుకొచ్చిన సుప్రీంకోర్టు (న్యాయమూర్తుల సంఖ్య) సవరణ ఆర్డినెన్స్-2026, ఆదాయపు పన్ను (సవరణ) ఆర్డినెన్స్-2026లను కూడా రాజ్యసభ ముందు ఉంచనున్నారు. ఈ సమావేశాల ద్వారానే ఇటీవల తృణమూల్ కాంగ్రెస్ నుంచి విడిపోయిన 20 మంది ఎంపీలతో ఏర్పడిన నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ) పార్లమెంటులో తొలి అడుగు పెట్టనుంది. కొత్త రాజకీయ సమీకరణాల నేపథ్యంలో ఈ పార్టీ వైఖరిపైనా ఆసక్తి నెలకొంది. పార్లమెంట్ తొలి రోజే ప్రభుత్వ అజెండా, ప్రతిపక్షాల దూకుడు స్పష్టమవడంతో రానున్న వారాల్లో నీట్ వివాదం, అయోధ్య విరాళాల ఆరోపణలు, చట్టసవరణ బిల్లులు, జాతీయ అంశాలపై ఉభయ సభల్లో తీవ్ర చర్చలు, వాగ్వాదాలు కొనసాగే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.



# న్యాయ పోరాటంతో రైతుల విజయం

- **రైతుల భూముల్లో జోక్యం వద్దని హైకోర్టు ఆర్డర్**
- **చామనపల్లిలో రైతుల సంబరాలు**
- **దుక్కి దున్నిన బిజెపి నేత కొయ్యల ఏమాజి**


**బెల్లంపల్లి, మహ:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సీనియర్ న్యాయవాది కొయ్యల ఏమాజి న్యాయ పోరాటంతో రైతులు విజయం సాధించారు. వారి కళ్ళల్లో ఆనందం కలిగింది. గ్రామంలో బ్యాండ్ బాజాలతో సంబరాలు చేసుకున్నారు. ఎట్టకేలకు న్యాయ పోరాటంతో వారి భూములు వారికి దక్కాయి. రైతుల భూముల్లో జోక్యం చేసుకోవద్దని తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం అటవీశాఖ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సీనియర్ న్యాయవాది కొయ్యల ఏమాజి భూముల్లో దుక్కి దున్ని వారికి అండగా నిలిచారు. ఈ సంఘటన వేమనాపల్లి మండలం చామనపల్లి గ్రామంలో చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళితే వేమనపల్లి మండలం చామనపల్లి గ్రామానికి చెందిన నిరుపేద రైతులు గత యాభై ఏళ్లుగా సర్వే నెంబర్ 65, 67 లో సాగు చేస్తున్నారు. వారికి ప్రభుత్వం పట్టాలు ఇవ్వడం జరిగింది. కానీ అటవీశాఖ అధికారులు ఇటీవల జోక్యం చేసుకొని ఈ భూములు అటవీశాఖకు చెందినవని రైతులను సాగు చేయనివ్వకుండా అడ్డుకుంటున్నారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో బిజెపి రాష్ట్ర నేత కొయ్యల ఏమాజి ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేశారు. అయినా అటవీశాఖ అధికారులు రైతులను వేధిస్తూ కేసులు నమోదు చేసి జైలుకు పంపించారు. దీనిని తీవ్రంగా పరిగణించిన కొయ్యల ఏమాజి తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో కేసు వేశారు. రైతుల పక్షాన పోరాటం చేసి విజయం సాధించారు. ఈ రోజు కోర్టు ఆర్డర్ తీసుకొని గ్రామానికి వెళ్ళారు. గ్రామంలో ఆయనకు బ్యాండు బాజాలతో రైతులు, మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. వారి భూముల్లో వెళ్ళి దుక్కి దున్నిన ఏమాజి అటవీశాఖ అధికారులను హెచ్చరించారు. రైతుల భూముల్లో జోక్యం చేసుకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తున్నదని హెచ్చరించారు. రైతులు బాధలు పడుతుంటే బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ హైద్రాబాద్ లో జల్సాలు చేస్తున్నారని విమర్శించారు. దళిత, గిరిజన ప్రజలు బాధల్లో వారి ఓట్లతో గద్దెనెక్కిన ఎమ్మెల్యే వినోద్, ఎంపీ గడ్డం వంశీ చలనం లేకుండా ఉన్నారని, వారు తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు కేశవ రెడ్డి, తుల మధుసూదన్ రావు, బిజెపి మండల అధ్యక్షుడు ఏట రవికుమార్ , రామయ్య యాదవ్, మడిపెల్లి సత్యం, లావణ్య, ముల్కల సత్యనారాయణ, జుమ్మిడి వెంకటేష్, బానయ్య, సతీష్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



# అడుప మహేష్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన కాంగ్రెస్ శ్రేణుల

- **పార్థివదేహానికి నివాళులర్పించిన ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, అయూబ్, నాయిని రాజేందర్ రెడ్డి, కే.ఆర్. నాగరాజు, బస్వరాజు సారయ్య**

**వరంగల్, మహా;** గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ అడుప మహేష్ హఠాన్మరణం చెందడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సోమవారం మహేష్ నివాసంలో ఉంచిన ఆయన పార్థివ దేహానికి హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పూలమాల వేసి భావోద్వేగ భరితంగా నివాళులర్పించారుఈ నివాళి కార్యక్రమంలో ఎమ్మెల్యేకు నాయిని రాజేందర్ రెడ్డి, కే.ఆర్. నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ డీసీసీ అధ్యక్షులు మొహమ్మద్ ఆయూబ్ తో పాటు కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాల్గొని పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. పార్టీ అభివృద్ధి కోసం, ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా మహేష్ చేసిన సేవలను నాయకులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అనంతరం అడుప మహేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.



# మాజీ మంత్రి కేటీఆర్ ను కలిసిన మైనార్టీ నాయకులు

**హన్మకొండ, మహా;** మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి పార్టీ కార్యానిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారక రామారావు ను ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ తో కలిసి సోమవారం హనుమకొండ, వరంగల్ జిల్లాల మైనార్టీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం లో మైనార్టీలకు కేటాయించిన స్థలాలను కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి తీసుకొందని వారు కేటీఆర్ దృష్టి తీసుకెళ్లారు. వారిని ఉద్దేశిస్తూ కేటీఆర్ మాట్లాడుతూ... మైనార్టీ లకు బీఆర్ఎస్ పార్టీ, వినయ్ భాస్కర్ కు, మేము అండగా ఉంటామని, అభివృద్ధి కి సైతం కట్టుబడి ఉన్నామని, వారి ఉద్యమానికి బాసటగా నిలుస్తామని వారి తరపున పోరాడుతామని భరోసా నిచ్చారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీని కూడా ఇచ్చారు.

# బల్దియా గ్రీవెన్స్‌లో 128 ఫిర్యాదులు

**వరంగల్, కార్పొరేషన్ మహా:** గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యాన్ని సహించబోమని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ టి. వెంకన్న అధికారులను హెచ్చరించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో నగర ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు పరిష్కారం కోసం అందజేశారు.అనంతరం టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, రెవెన్యూ, శానిటేషన్, ఆరోగ్యం, నీటి సరఫరా తదితర విభాగాల గ్రీవెన్స్ దరఖాస్తుల పరిష్కార తీరును సమీక్షించిన కమిషనర్, ప్రతి వారం స్వీకరించిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ ఫిర్యాదులు పేరుకుపోతే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవాల ఆధారంగా పరిష్కరించాలని సూచించారు .ఈ వారంలో మొత్తం 128 ఫిర్యాదులు అందగా, టౌన్ ప్లానింగ్‌కు 58, ఇంజనీరింగ్‌కు 38, రెవెన్యూకు 13, హెల్త్-శానిటేషన్‌కు 9, నీటి సరఫరాకు 9, హార్టికల్చర్ విభాగానికి ఒక ఫిర్యాదు వచ్చినట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ రాజ్ కుమార్, సీఎంహెచ్‌వో డా. రాజారెడ్డి, డీఎఫ్‌వో శంకర్ లింగం, ఇన్‌చార్జి సీపీ రవీందర్ రాడేకర్, పన్నుల అధికారి రామకృష్ణ, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి, సమ్మయ్య, సెక్రటరీ అనిల్‌బాబు, హెచ్‌వో లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాలు

# ఘనంగా నిర్వహించాలి

- **ఉత్సవాలకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి**
- **ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**




దర్గా పీఠాధిపతి, జిల్లా కలెక్టర్, జిడబ్ల్యూఎంసి కమిషనర్, వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే **సమన్వయ సమావేశంహనుమకొండ మహా** : హనుమకొండ జిల్లాలో ఆగస్ట్ 6 నుంచి 12 తేదీవరకు జరగనున్న కాజీపేట హజ్రత్ సయ్యద్ షా ఖాద్రీ చిష్తీ దర్గా ఉర్సు ఉత్సవాలను భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అత్యంత ఘనంగా నిర్వహించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లా స్థాయి సమన్వయ సమావేశాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, దర్గా పీఠాధిపతి, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రూ పాషా, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.ఈ సమావేశంలో జిల్లా మైనారిటీ సంక్షేమ, వైద్య ఆరోగ్య, మున్సిపల్, విద్యుత్, పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక, ఆర్టీసీ, తాగునీటి సరఫరా, ఇతర శాఖల అధికారులు పాల్గొని ఉత్సవాల ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా వేలాది మంది భక్తులు దర్గాను సందర్శిస్తారని, అలాంటి పరిస్థితుల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని శాఖలు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. ప్రతి శాఖ తమకు కేటాయించిన బాధ్యతలను నిర్లక్ష్యం చేయకుండా సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు.దర్గా రైల్వే ట్రాక్‌కు సమీపంలో ఉన్నందున భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైల్వే అధికారులు, సంబంధిత స్టేషన్ గేట్ మాస్టర్లు ఉత్సవాల రెండు రోజుల పాటు అప్రమత్తంగా ఉండి రైళ్ల రాకపోకల సమయంలో సమన్వయం పాటించాలని సూచించారు. అవసరమైతే అదనపు భద్రతా సిబ్బందిని నియమించాలని కోరారు. నగరం నలుమూలలతో పాటు ఇతర జిల్లాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పార్కింగ్ ఏర్పాట్లు, ట్రాఫిక్ మళ్లింపులు, ప్రత్యేక మార్గాల ఏర్పాటు వంటి అంశాలను ముందుగానే పూర్తి చేయాలని పోలీసులకు సూచించారు.ఉత్సవాల సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ప్రత్యామ్నాయ విద్యుత్ ఏర్పాట్లు కూడా సిద్ధంగా ఉంచాలని ఎమ్మెల్యే ఆదేశించారు. తాగునీటి కొరత లేకుండా తగినన్ని వాటర్ ట్యాంకర్లు, తాగునీటి కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు.దర్గా పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడం, పారిశుధ్య సిబ్బందిని ప్రత్యేకంగా నియమించడం, ఫాగింగ్, బ్లీచింగ్ కార్యక్రమాలు నిర్వహించడం, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు.

భక్తులకు అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, అంబులెన్సులు, వైద్య బృందాలను సిద్ధంగా ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. ఉత్సవాల సందర్భంగా భారీ జనసందోహం ఏర్పడే అవకాశం ఉన్నందున దర్గా పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు ఆగస్టు 10, 11 తేదీల్లో స్థానిక సెలవులు ప్రకటించాలని సమావేశంలో నిర్ణయించారు.సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేయడం, తాత్కాలిక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం, తగినంత పోలీసు బందోబస్తు కల్పించడం, అగ్నిమాపక సిబ్బందిని సిద్ధంగా ఉంచడం, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, ట్రాఫిక్ వంటి అన్ని అంశాల్లో శాఖల మధ్య సమన్వయం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

అనంతరం ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ ఉర్సు ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేస్తామని, ప్రతి శాఖకు స్పష్టమైన బాధ్యతలు అప్పగించి ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. దర్గా ఉత్సవాలు జిల్లాలో అతిపెద్ద ఉత్సవాలు అని పేర్కొన్నారు. ఉత్సవాల సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి దాదాపు రెండు లక్షల మంది భక్తులు హాజరవుతుంటారు కాబట్టి అధికారులు సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సదుపాయాలను సంబంధిత శాఖల అధికారులు కల్పించాలన్నారు. ప్రశాంతంగా దర్గా ఉత్సవాలు విజయవంతంగా జరిగే విధంగా ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేయాలన్నారు. దర్గా పీఠాధిపతి, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రూ పాషా మాట్లాడుతూ ఉర్సు ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, భక్తులందరికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మేన శ్రీను, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, మాజీ కార్పొరేటర్ అబూబకర్, మున్సిపల్, రెవెన్యూ, పోలీస్, ఆర్ అండ్ బి, విద్యుత్, రైల్వే, ఆర్టీసీ, అగ్నిమాపక, ఇతర శాఖల అధికారులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్, మహా;** వరంగల్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని ప్రజలనుండి వినతులు స్వీకరించారు. ఈ ప్రజావాణి కి మొత్తం 192 దరఖాస్తులు వచ్చాయి. అందులో రెవెన్యూ శాఖకు 51, మున్సిపాలిటీకి 06, హౌసింగ్ శాఖకు 65, డిఆర్డిఓ 18,ఇతర శాఖలకు సంబంధించి 52 దరఖాస్తులు వచ్చాయి. వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు తక్షణమే ఎండార్స్ చేసి సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖలు అధికారులను ఆదేశించారు. ప్రజావాణికి రెవెన్యూ హౌసింగ్ ,పెన్షన్ సమస్యల పై ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయని అట్టి దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, జడ్పీ సీఈవో రామ్‌రెడ్డి, డీఆర్వో విజయలక్ష్మి, డిఆర్డిఓ నాగ పద్మజ, డి ఎం ఎం హెచ్ ఓ డా.ప్రకాష్ , సంబంధిత జిల్లా అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అక్రమ మొరం రవాణాకు చెక్

**హన్మకొండ, మహా:** హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా మొరం రవాణా చేస్తున్న టిప్పర్ లారీని పోలీసులు స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసు నమోదు చేశారు. బస్టాండ్ ప్రధాన రహదారిపై పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా వెళ్తున్న టిప్పర్‌ను తనిఖీ చేయగా, గట్ల నర్సింగాపూర్ నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్నట్లు గుర్తించారు. లారీ యజమాని పల్లాపు రాజు ఆదేశాల మేరకు రవాణా చేస్తున్నట్లు డ్రైవర్ కొగిల్ల తిరుపతి అంగీకరించడంతో వాహనాన్ని స్వాధీనం చేసుకుని చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ తెలిపారు.




# ఎంజీఎం ను సందర్శించిన వరంగల్ సీపి శ్వేత, ఐపిఎస్

**వరంగల్ క్రైమ్ ;** వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపిఎస్ సోమవారం వరంగల్ ఎంజీఎం హాస్పటల్ ను సందర్శించారు. సోమవారం ఉదయం ఎంజీఎం కు చేరుకున్న పోలీస్ కమిషనర్ ముందుగా పోలీస్ అవుట్ పోస్ట్ సందర్శించి సిబ్బంది నిర్వహిస్తున్న విధులు, ఇక్కడికి వచ్చే మెడికో లీగల్ కేసులకు సంబంధించి ఏవిధమైన చర్యలు చేపడుతున్నారు, వీటికి సంబంధించి వివరాలను నమోదు చేసే రికార్డులను పోలీస్ కమిషనర్ పరిశీలించారు. అనంతరం పోలీస్ కమిషనర్ మత్తు పదార్థాలకు బానిసలుగా మారిన యువతకు చికిత్స అందిస్తున్న డి అడిక్షన్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ కేంద్రంలో మత్తు పదార్థాలకు అలవాటు పడిన యువతను సాధరణ స్థితికి తీసుకువచ్చేందుకు వైద్యులు అందిస్తున్న చికిత్స విధానాన్ని వైద్యులు పోలీస్ కమిషనర్ కు వివరించారు. ఈ సందర్భంగా ఎంజీఎం పరిసరాలను పరిశీలించిన పోలీస్ కమిషనర్ హాస్పటల్ కు సంబంధించి ప్రధాన మార్గంతో పాటు, వాహన పార్కింగ్ ప్రదేశాలు, ముఖ్యమైన స్థలాల్లో సిసి కెమెరాల ఏర్పాటు పై సంబంధించిన అధికారులకు పలు సూచనలు చేయడంతో పాటు, యం.జి.యం లో పార్కింగ్ ఏర్పాట్లు, హాస్పిటల్ సంబంధించి ప్రధాన మార్గం నుండి హాస్పటల్ కు వచ్చే సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా హాస్పటల్ ప్రధాన ద్వారంలో ఆటోలను నిలపకుండా తీసుకోవాల్సిన చర్యల పై సిపి ట్రాఫిక్ అధికారులకు పలు సూచనలు చేశారు.పోలీస్ కమిషనర్ వెంట సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత,యం.జి.యం సూపరింటెండెంట్ రాంకుమార్ రెడ్డి, ఆర్.యం. ఓ, ఏసీపీలు జితేందర్ రెడ్డి, సదయ్య, సత్యనారాయణ, ప్రశాంత్ రెడ్డి, ఇన్స్ స్పెక్టర్లు కరుణాకర్, రాఘవేందర్ తో పాటు ఆర్.ఎస్.ఐలు పూర్ణ చందర్ రెడ్డి, మనోజ్, నాగరాజు ఉన్నారు.

# బెల్లంపల్లి మున్సిపల్లో చెత్త నియంత్రణకై చర్యలు

**....16 ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాట**



**బెల్లంపల్లి, మహ:** బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో అక్రమంగా చెత్త వేయడాన్ని అరికట్టేందుకు 16 కీలక ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ మాట్లాడుతూ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ నిర్వహించేందుకు మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు అందులో భాగంగా పట్టణంలోని రాంనగర్ బ్రిడ్జి సమీపంలో, కాల్‌టెక్స్ ఫ్లైఓవర్ క్రింద, షంషీర్ నగర్, ఏరియా హాస్పిటల్ పరిసర ప్రాంతం, అశోక్ నగర్ టర్నింగ్ పాయింట్, వన్ గ్రౌండ్ సమీపంలో, కన్నాల బస్తీ ఫ్లైఓవర్ వద్ద, టేకులబస్తీ మెయిన్ రోడ్, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ రోడ్, రామ టాకీస్* పక్కన తదితర ప్రాంతాల్లో చెత్త వేయడాన్ని నిరోధించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయబడ్డాయి. అదేవిధంగా పట్టణంలోని పార్కులు , పాత మున్సిపల్ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో కూడా కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగింది.సంబంధిత ప్రాంతాల్లో ఎవరైనా చెత్త వేస్తే సీసీ కెమెరాల ద్వారా గుర్తించి సంబంధిత వ్యక్తులపై మున్సిపాలిటీ నిబంధనల ప్రకారం జరిమానా విధించబడుతుందనీ అలాగే చెత్త వేసిన వారి వివరాలను సంబంధిత వార్డు వాట్సాప్ గ్రూపులలో మరియు ప్రజలకు అందుబాటులో ఉన్న ఇతర మాధ్యమాల ద్వారా తెలియజేయడం జరుగుతుందని పేర్కొన్నారు.పట్టణ ప్రజలందరూ మున్సిపాలిటీకి సహకరించి తమ ఇళ్లలో ఉత్పత్తి అయ్యే తడి చెత్త, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించి మున్సిపల్ వాహనాలకు అందించాలని, పరిశుభ్రమైన బెల్లంపల్లి నిర్మాణానికి ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని, మన బెల్లంపల్లి పట్టణాన్ని చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పట్టణ ప్రజలకు మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ విజ్ఞప్తి చేశారు.

# డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి విశేష స్పందన

- **పదవులతో సంబంధం లేదు నిరంతరం ప్రజా సేవలోనే**
- **మంత్రి కొండా సురేఖ**
- **చరవాణి ద్వారా వచ్చిన వినతులను నేరుగా విన్న మంత్రి**
- **ప్రజా సమస్యల పై పరిష్కారానికి మంత్రి అప్పటికప్పుడే అధికారులకు ఆదేశాలు**



**వరంగల్, మహా;** ప్రజలకు ప్రభుత్వం మరింత చేరువ కావాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా నిర్వహించిన "డయల్ యువర్ ఎమ్మెల్యే" కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి, వరంగల్ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే కొండా సురేఖ ప్రజల నుంచి నేరుగా ఫోన్ కాల్స్ ద్వారా వినతులు స్వీకరించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం తో పాటు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కాల్స్‌లో రెవెన్యూ, భూ సమస్యలు, తాగునీరు, రహదారులు, టాయిలెట్లు, డ్రైనేజీ, విద్యుత్, సంక్షేమ పథకాల అమలు, ఇందిరమ్మ ఇండ్లు, శ్మశాన వాటికల ఏర్పాటు, మౌలిక సదుపాయలు, పెన్షన్లు తదితర అంశాలపై ప్రజలు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి వినతిని ఓపికగా విన్న మంత్రి, సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి, వారి సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తానని వారికి భరోసా ఇచ్చారు. కొన్ని సమస్యల పై వెంటనే వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద, జీడబ్ల్యుఎంసి కమిషనర్ వెంకన్న తో పాటు పలువురు ఇతర అధికారులతో మాట్లాడి ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ "ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధిగా ప్రజలు నన్ను గుర్తిస్తారు. ప్రజలు నాపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకునేందుకు ప్రతి వినతిని నా సమస్యగా భావించి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నాను. ప్రజా ప్రభుత్వంలో ప్రతి వ్యక్తికి న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోనూ తాను, తన భర్త, మాజీ ఎమ్మెల్సీ మురళీధర్ రావు ప్రజల నుంచి వినతులు, దరఖాస్తులు స్వీకరిస్తూ, సంబంధిత అధికారులతో అప్పటికప్పుడు మాట్లాడి సాధ్యమైనంత వేగంగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. అంతేకాకుండా, హైదరాబాద్ సచివాలయంలోని తన కార్యాలయంలోనూ, జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలోనూ, బంజారాహిల్స్ ల్ లోని క్యాంపు కార్యాలయంలోనూ ప్రజలు, అవసరార్థులు, పార్టీ కార్యకర్తల నుంచి వినతులు, దరఖాస్తులు స్వీకరించి, సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తూ పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తున్నట్లు మంత్రి వివరించారు.పదవులతో సంబంధం లేకుండా నిరంతరం ప్రజా సేవలోనే తృప్తిని వెతుక్కుంటున్నాను. ప్రజల సమస్యలు పరిష్కారమై వారి ముఖాల్లో చిరునవ్వు చూడటమే నాకు నిజమైన సంతృప్తి. ప్రజలకు అందుబాటులో ఉండటం నా బాధ్యతగా, వారి విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం నా కర్తవ్యంగా భావిస్తున్నాను" అని మంత్రి సురేఖ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో వుంటుందని, ప్రజల సమస్యల పరిష్కారానికే తమ తొలి ప్రాధాన్యమని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు జవాబుదారీతనంతో కూడిన, పారదర్శకమైన, ప్రజా కేంద్రిత పాలన అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

# బెల్లంపల్లి పట్టణంలోని ప్రధాన రహదారికి మరమ్మతులు

**బెల్లంపల్లి, మహ:** బెల్లంపల్లి పట్టణంలోని ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలకు మున్సిపల్ చైర్పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు ఆధ్వర్యంలో మున్సిపల్ యంత్రాంగం సోమవారం నాడు మరమ్మత్తు పనులను ప్రారంభించారు . ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ దావత్వాది రమేష్ బాబు మాట్లాడుతూ బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు బెల్లంపల్లి పట్టణంలోని ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టడం జరిగిందన్నారు. వర్షాకాలం దృష్ట్యా బెల్లంపల్లి పట్టణంలోని ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను మున్సిపాలిటీ నిధులతో మరమ్మతులు చేయించడం జరిగిందని,వర్షాకాలం వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులు చేయిస్తున్నామని, త్వరలోనే సమస్యకు శాశ్వత పరిష్కారం జరిగేలా నూతన రోడ్డు నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. పట్టణ ప్రజలందరు రోడ్ల విస్తరణకు, అభివృద్ధి పనులకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## జాతీయ స్థాయిలో రాగ్ మయూర్‌కు అరుదైన గౌరవం

### 'సివరాపల్లి' వెబ్ సిరీస్‌కు ఉత్తమ నటుడి అవార్డు



**మహా :** టాలీవుడ్ యువ నటుడు రాగ్ మయూర్ జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు దక్కించుకున్నారు. ముంబైలో ఘనంగా నిర్వహించిన 'నెక్సా స్ట్రీమింగ్ అకాడమీ అవార్డ్స్' వేడుకలో ఆయన ఉత్తమ నటుడు (బెస్ట్ యాక్టర్) అవార్డును అందుకొని తెలుగు సినీ పరిశ్రమకు మరోసారి గర్వకారణంగా నిలిచారు.సూపర్ హిట్ హిందీ వెబ్ సిరీస్ 'పంచాయత్' అధికారిక తెలుగు రీమేక్ 'సివరాపల్లి'లో ఆయన పోషించిన పాత్రకు ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించింది. బాలీవుడ్, టాలీవుడ్‌తో పాటు దేశవ్యాప్తంగా పలు సినీ పరిశ్రమలకు చెందిన ప్రముఖులు పాల్గొన్న ఈ అవార్డుల వేడుకలో, ఓటీటీ విభాగంలో తీవ్ర పోటీని అధిగమించి రాగ్ మయూర్ ఈ గౌరవాన్ని సొంతం చేసుకోవడం విశేషం.2021లో విడుదలైన 'సినిమా బండి' చిత్రంతో నటుడిగా కెరీర్ ప్రారంభించిన రాగ్ మయూర్ తొలి సినిమాతోనే తన సహజ నటనతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. అనంతరం హీరోగా, కామెడీ పాత్రల్లో, ప్రతినాయకుడిగానూ విభిన్న పాత్రలను పోషిస్తూ తన నటనా వైవిధ్యాన్ని చాటుకున్నారు. కథకు ప్రాధాన్యం ఉన్న సినిమాలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు ఏర్పరుచుకుంటున్నారు.ప్రస్తుతం రాగ్ మయూర్ హీరోగా నటిస్తున్న 'అనుమాన పక్షి' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో జాతీయ స్థాయి ఉత్తమ నటుడి అవార్డు అందుకోవడంతో సినీ ప్రముఖులు, అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.



## పుష్ప తర్వాత సుకుమార్‌కు మరో భారీ పరీక్ష

**మహా : హైదరాబాద్:** 'పుష్ప' సిరీస్‌తో పాన్ ఇండియా స్థాయిలో సంచలన విజయాన్ని అందుకున్న దర్శకుడు సుకుమార్ ఇప్పుడు తన తదుపరి చిత్రంపై పూర్తి దృష్టి సారించినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రామ్ చరణ్ హీరోగా రూపొందనున్న ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ దశలో ఉండగా, కథతో పాటు టెక్నికల్ టీమ్ ఎంపిక కూడా ఆసక్తికరంగా మారింది.ఇప్పటికే సినిమా స్క్రిప్ట్ పనులు పూర్తయ్యాయని సమాచారం. ప్రస్తుతం సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్, ఆర్ట్ డైరెక్షన్, యాక్షన్ కొరియోగ్రఫీ తదితర కీలక విభాగాలకు అత్యుత్తమ సాంకేతిక నిపుణులను ఎంపిక చేసే ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. తన ప్రతి చిత్రంలో కథకు ఎంత ప్రాధాన్యం ఇస్తారో, అదే స్థాయిలో సాంకేతిక నాణ్యతపైనా సుకుమార్ ప్రత్యేక శ్రద్ధ చూపుతారనే పేరు ఉంది.

'రంగస్థలం', 'పుష్ప' చిత్రాల విజయాల్లో కథతో పాటు అద్భుతమైన విజువల్ ప్రెజెంటేషన్ కూడా కీలక పాత్ర పోషించింది. ప్రతి ఫ్రేమ్‌ను ప్రత్యేకంగా తీర్చిదిద్దే సుకుమార్ శైలి ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. దీంతో రామ్ చరణ్‌తో తెరకెక్కనున్న ఈ స్టైలిష్ యాక్షన్ డ్రామాలో కూడా విజువల్ క్వాలిటీకి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు సమాచారం.

'పుష్ప' తర్వాత సుకుమార్ నుంచి వస్తున్న తొలి సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. పాన్ ఇండియా మార్కెట్ లో ఆయన బ్రాండ్ విలువ పెరగడంతో, ఈసారి ఎలాంటి కథను ఎంచుకున్నారు? ఎలాంటి సాంకేతిక బృందాన్ని సిద్ధం చేస్తున్నారు? అనే అంశాలపై సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అందుకే ఈ సినిమా ఆయన కెరీర్‌లో మరో కీలక పరీక్షగా మారనుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సుకుమార్ కెరీర్‌ను పరిశీలిస్తే 'ఆర్య' నుంచి 'రంగస్థలం', 'పుష్ప' వరకు ప్రతి చిత్రంలో వైవిధ్యమైన కథాంశాలను ఎంచుకుంటూ దర్శకుడిగా తన ప్రత్యేకతను చాటుకున్నారు. అదే తరహాలో ఈసారి కూడా ప్రేక్షకులు ఊహించని కథ, కొత్త తరహా పాత్రలతో ముందుకు రావాలని ఆయన లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది.

ఇక రామ్ చరణ్ కూడా ప్రస్తుతం పాన్ ఇండియా స్టార్‌గా వరుస భారీ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నారు. ఈ ఇద్దరి క్రేజీ కాంబినేషన్‌లో సినిమా తెరకెక్కుతుండటంతో అంచనాలు మరింత పెరిగాయి. సెప్టెంబర్‌లో చిత్రాన్ని అధికారికంగా ప్రారంభించి, దసరా తర్వాత రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. 2027లో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాతలు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

అయితే ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన చర్చ కథ కంటే టెక్నికల్ టీమ్ గురించే ఎక్కువగా సాగుతోంది. 'పుష్ప'తో నెలకొల్పిన అంచనాలను మరోసారి అధిగమించి సుకుమార్ కొత్త సంచలనం సృష్టిస్తారా? అన్న ప్రశ్నకు సమాధానం తెలియాలంటే మరికొంత కాలం వేచి చూడాల్సిందే.

## గులాబీ అందాలతో కట్టిపడేసిన కేతిక శర్మ

**మహా :** గులాబీ రంగు సంప్రదాయ దుస్తుల్లో మెరిసిపోతూ, తన అందం, హావభావాలతో అభిమానులను మరోసారి ఆకట్టుకుంది యువ కథానాయిక కేతిక శర్మ. సొగసైన చిరునవ్వు, ఆకర్షణీయమైన లుక్స్‌తో సోషల్ మీడియాలో ఆమె పంచుకున్న తాజా ఫొటోలు వైరల్‌గా మారాయి. గ్లామర్‌తో పాటు సంప్రదాయ శైలిలోనూ మెప్పించగల నటి అని మరోసారి నిరూపించుకుంది.1995 డిసెంబర్ 24న న్యూఢిల్లీలో జన్మించిన కేతిక శర్మ మోడల్‌గా, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించింది. అనంతరం తెలుగు చిత్రసీమలో అడుగుపెట్టి తక్కువ సమయంలోనే ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. 2021లో ఆకాశ్ పూరి సరసన నటించిన 'రొమాంటిక్' చిత్రంతో కథానాయికగా పరిచయమైన ఆమె, అదే ఏడాది 'లక్ష్య' చిత్రంలోనూ నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది.ఆ తర్వాత 'రంగా రంగ వైభవంగా' చిత్రంలో తన అందం, అభినయంతో మంచి గుర్తింపు పొందిన కేతికకు, 2023లో విడుదలైన 'బ్రో' సినిమా కెరీర్‌లో కీలక మలుపుగా నిలిచింది. సాయి ధరమ్ తేజ్, పవన్ కళ్యాణ్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన ఈ చిత్రం ఆమెకు మరింత క్రేజ్ తీసుకొచ్చింది. అనంతరం 'విజయ్ 69' చిత్రంతో హిందీ చిత్రసీమలోనూ అడుగుపెట్టి తన పరిధిని విస్తరించింది.ప్రస్తుతం కేతిక శర్మ చేతిలో పలు ఆసక్తికర ప్రాజెక్టులు ఉన్నాయి. 'రాబిన్‌హుడ్', 'సింగిల్' చిత్రాలతో పాటు తమిళంలో రూపొందుతున్న **'మీసాయ మురుక్కు 2'**లోనూ నటిస్తోంది. గ్లామర్ పాత్రలతో పాటు నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు ఏర్పరుచుకునే ప్రయత్నంలో ఉంది. సినిమాలతో పాటు ప్రముఖ బ్రాండ్ల ప్రచార కార్యక్రమాల్లోనూ పాల్గొంటున్న కేతిక, సోషల్ మీడియాలోనూ భారీ అభిమాన వర్గాన్ని సంపాదించుకుంది. కొత్త తరానికి చెందిన కథానాయికల్లో తనదైన అందం, ఉత్సాహభరితమైన నటన, ఫ్యాషన్ సెన్స్‌తో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంటూ తెలుగు చిత్రసీమలో ఆశాజనక కథానాయికగా ఎదుగుతోంది.





## యష్–ప్రశాంత్ వర్మ కాంబోపై జోరుగా ప్రచారం


### భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు రంగం సిద్ధమా?

**మహా :** పాన్ ఇండియా స్టార్ యష్, దర్శకుడు ప్రశాంత్ వర్మ కాంబినేషన్‌లో ఓ భారీ చిత్రం తెరకెక్కనున్నట్లు సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం ఇద్దరూ తమ తమ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నప్పటికీ, వాటి తర్వాత ఈ క్రేజీ కాంబినేషన్ సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉందనే వార్త అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. 'కేజీఎఫ్' సిరీస్‌తో దేశవ్యాప్తంగా సంచలన విజయాన్ని అందుకున్న యష్ ప్రస్తుతం 'టాక్సిక్' చిత్రంలో నటిస్తున్నారు. అలాగే నితేశ్ తివారి దర్శకత్వంలో రూపొందుతున్న భారీ చిత్రం 'రామాయణ'లో రావణుడి పాత్రను పోషిస్తున్నారు. ఈ రెండు చిత్రాలపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.ఇక దర్శకుడు ప్రశాంత్ వర్మ 'హనుమాన్' విజయంతో పాన్ ఇండియా స్థాయిలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం రిషబ్ శెట్టి ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'జై హనుమాన్' చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఇందులో రిషబ్ శెట్టి హనుమంతుడి పాత్రలో కనిపించనుండగా, ఈ ప్రాజెక్ట్‌పై ప్రశాంత్ వర్మ పూర్తిగా దృష్టి సారించినట్లు సమాచారం. భారతీయ పురాణాల నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రం కూడా భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం, ప్రస్తుతం చేస్తున్న చిత్రాలు పూర్తయిన అనంతరం యష్, ప్రశాంత్ వర్మ కలిసి ఓ భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌ను ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. అయితే ఈ వార్తలపై ఇప్పటివరకు చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.ఈ కాంబినేషన్ నిజమైతే భారతీయ సినీ పరిశ్రమలో మరో క్రేజీ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టినట్లేనని ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. యష్ స్టార్‌డమ్‌కు ప్రశాంత్ వర్మ విజన్ తోడైతే మరో భారీ విజువల్ వండర్ ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

## 'టాక్సిక్' నుంచి మరో పాటకు రంగం సిద్ధం

### 'తబాహీ' హిట్ తర్వాత కొత్త అప్‌డేట్‌తో మూవీ టీమ్

కన్నడ స్టార్ యష్ హీరోగా తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్'పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. సినిమా విడుదలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, ఇప్పటికే ప్రచార కార్యక్రమాలతో చిత్రబృందం అభిమానుల్లో భారీ ఆసక్తిని నెలకొల్పుతోంది. ఇటీవల విడుదలైన 'తబాహీ' పాట సోషల్ మీడియాలో సంచలనం సృష్టించగా, ఇప్పుడు మరో పాటను విడుదల చేసేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు.తాజా సమాచారం ప్రకారం, ఈ రెండో పాటకు తనిష్క్ బాగ్చి, ఫహీమ్ అబ్దుల్లా, అర్స్లాన్ నిజామీ సంగీతం అందించగా, ప్రముఖ గాయకుడు సిద్ధార్థ్ బస్రూర్ ఆలపించినట్లు తెలుస్తోంది. సంగీతం, విజువల్స్ పరంగా ఈ పాట కూడా ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందించినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి.ఇప్పటికే విడుదలైన 'తబాహీ' పాటలో యష్ సరసన కియారా అద్వానీ సందడి చేయగా, ఈసారి విడుదల కానున్న పాటలో తారా సుతారియా యష్‌తో కలిసి కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. పూర్తిగా భిన్నమైన కాన్సెప్ట్‌తో ఈ పాటను చిత్రీకరించినట్లు సమాచారం. చిత్రబృందం ఈ పాటను రేపు విడుదల చేయనున్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇప్పటికే 'టాక్సిక్'పై భారీ అంచనాలు నెలకొన్న నేపథ్యంలో, కొత్త పాట కూడా సినిమాపై మరింత హైప్‌ను తీసుకురానుందని అభిమానులు భావిస్తున్నారు.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com